వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 54 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-

## నేటి నుంచే కొత్త జీఎస్టీ..




- ఇక నుంచి రెండు శ్లాబులే
- 5, 18 శాతాలు మాత్రమే
- సిన్ గూడ్స్‌పై మాత్రం 40%

న్యూఢిల్లీ

సవరించిన జీఎస్టీ శ్లాబ్‌ల ధరలు దేశవ్యాప్తంగా సోమవారం నుంచి అమలులోకి వస్తున్నాయి. ఇక నుంచి 5, 18 శాతం క్యాటగిరీలే ఉంటాయి. అయితే కొన్ని లగ్జరీ, సిన్ (హానికర) గూడ్స్‌ను 40 శాతం శ్లాబ్ పరిధిలోకి తెస్తారు. చాలా వరకు నిత్యావసర వస్తువులను 5 శాతం పరిధిలోకి, ఇతర వస్తువులు, సేవలను 18 శాతం పరిధిలోకి చేర్చారు. పొగాకు, ఆల్కహాల్, బెట్టింగ్, ఆన్‌లైన్‌గేమింగ్ వంటి సిన్ గూడ్స్‌ను 40 శాతం పరిధిలోకి తెచ్చారు.5 శాతం పరిధిలోకి వచ్చేవి: నెయ్యి, పన్నీరు, డ్రైఫ్రూట్‌లు, బిస్కట్లు, జామ్, కెచప్‌లు, నామ్‌కీన్‌టూత్ పేస్ట్‌లు, సబ్బులు, షాంపూలు -మిగతా 3 లో


## ఫిలిప్పీన్స్‌లో 'నేపాల్' తరహా నిరసనలు

- ప్రభుత్వ అవినీతిపై వెల్లువెత్తిన ఆగ్రహం




మనీలా

నేపాల్‌లో ప్రభుత్వ అవినీతిపై వెల్లువెత్తిన ప్రజాగ్రహం.. ఇప్పుడు ఫిలిప్పీన్స్‌ను తాకింది. ప్రభుత్వ అవినీతి బాగోతాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆదివారం దేశ రాజధాని మనీలాలో ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. వారిని నియంత్రించడానికి పెద్ద ఎత్తున భద్రతా బలగాలను మోహరించాల్సి వచ్చింది.వరద నియంత్రణ ప్రాజెక్టుల కోసం కేటాయించిన భారీ మొత్తంలోని(సుమారుగా రూ.83 వేల కోట్లు) డబ్బు.. ప్రభుత్వ పెద్దలు, అధికారులు, బడా వ్యాపారుల జేబుల్లోకి వెళ్లిందన్న ఆరోపణలు ప్రభుత్వాన్ని కుదిపేస్తున్నాయి.



## పాలస్తీనా దేశమే..

- గుర్తించిన బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా

లండన్

బ్రిటన్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అమెరికా, ఇజ్రాయిల్‌ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ.. పాలస్తీనా ను అధికారికంగా దేశంగా గుర్తించింది. బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ ఈ విషయాన్ని ప్రకటించారు. పాలస్తీనీయులు, ఇజ్రాయిల్ పౌరుల్లో శాంతిస్థాపన ఆశలను పునరుద్ధరించేందుకు, ద్విదేశ పరిష్కారం కోసం ఈమేరకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కెనడా, ఆస్ట్రేలియాలు సైతం ఈమేరకు ప్రకటన చేశాయి. -మిగతా 3 లో

# రాష్ట్రమంతా సౌభాగ్యంగా ఉండాలి

## వరంగల్‌లో బతుకమ్మ పండుగ ప్రారంభోత్సవం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి, జూపల్లి
- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన మంత్రులు

హనుమకొండ – ప్రజా స్వేచ్ఛ

ప్రకృతిలో లభించే అనేక రకాల పూలతో తొమ్మిది రోజులపాటు మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో గౌరమ్మను పూజిస్తారని, వారి పూజలు ఫలప్రదమై రాష్ట్రంతో పాటు రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం రాత్రి తెలంగాణ సంగీత అకాడమీ ఆధ్వర్యంలో కాకతీయ నృత్య ప్రదర్శనతో పాటు వేయి స్తంభాల గుడి వద్ద బతుకమ్మ పండుగ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ పండుగ ప్రారంభం అయిందని అన్నారు. -మిగతా 3 లో








## సిద్దిపేట ఎవరి జాగీరు కాదు

- ఎన్ని ఆంక్షలు పెడితే అన్నిసార్లు వస్తా
- తల్లీబిడ్డను ఎడబాపారు..
- చంద్రుడు లాంటి కేసీఆర్‌కు మచ్చ తెచ్చారు
- చింతమడక ఇచ్చిన ధైర్యంతో ముందుకు వెళ్తున్న..
- కన్న ఊరు భవిష్యత్తులో కర్మ భూమి కావొచ్చు
- చింతమడక బతుకమ్మ సంబురాల్లో కవిత ఘాటు వ్యాఖ్యలు
- కుటుంబంలో చిచ్చు పెట్టిన వారిని వదిలిపెట్టనంటూ హెచ్చరికలు
- భావోద్వేగంతో కంటతడి..

సిద్దిపేట – ప్రజా స్వేచ్ఛ

'సిద్దిపేట, చింతమడక ఎవరి జాగీరు కాదు.. ఎన్ని ఆంక్షలు పెడితే అన్నిసార్లు వస్తా.. తాటతీస్తా..' అంటూ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. 'తల్లీబిడ్డను ఎడబాపారు.. చంద్రుడు లాంటి కేసీఆర్‌కు మచ్చ తెచ్చారు' అంటూ భావోద్వేగంతో కంటతడి పెట్టారు. సిద్దిపేట రూరల్ మండలంలోని మాజీ సీఎం కేసీఆర్ స్వగ్రామమైన చింతమడక గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎంగిలిపూల బతుకమ్మ సంబురాల్లో ఆదివారం ఆమె పాల్గొన్నారు. ముందుగా రాఘవ పూర్ వద్ద గ్రామస్తులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. -మిగతా 3 లో




## 30 నాటికి ఎస్ఐఆర్ అమలుకు సిద్ధంగా ఉండండి

- రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ఇసి ఆదేశం

న్యూఢిల్లీ


దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియకు ఎన్నికల సంఘం (ఇసి) వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే ఈ నెల 30 నాటికి ఎస్ఐఆర్ అమలుకు సిద్ధంగా ఉండాలని అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ఈ నెల ప్రారంభంలో దేశరాజధానిలో జరిగిన రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల (సిఇఓ) సమావేశంలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం -మిగతా 3 లో

## అఫ్గానిస్థాన్‌కు ట్రంప్ బెదిరింపులు

- 'బగ్రామ్' అప్పగించాల్సిందేనని హుకుం

న్యూయార్క్

ప్రపంచ దేశాలపై వివిధ రూపాల్లో విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ఆఫ్ఘానిస్థాన్‌పై తాజాగా బెదిరింపులకు దిగారు. బగ్రామ్ వైమానిక స్థావరాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని భావిస్తున్నట్లు ఇటీవల పేర్కొన్న ఆయన దాన్ని తిరిగి తమకు అప్పగించాల్సిందేనని పేర్కొన్నారు. ఒకవేళ ఇందుకు సిద్ధపడకపోతే అఫ్ఘనిస్థాన్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని బెదిరించారు. ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమ వేదిక అయిన 'ట్రూత్ సోషల్'లో ఆయన పోస్టు పెట్టారు. అఫ్గానిస్థాన్ లోని బగ్రామ్ వైమానిక స్థావరాన్ని నిర్మించిన వారికి అంటే.. అమెరికాకు తిరిగి ఇచ్చేయాలని ట్రంప్ డిమాండ్ చేశారు. అలా చేయకపోతే..



-మిగతా 3 లో

# స్వదేశీ వస్తువులే వాడండి

## జీఎస్టీ సంస్కరణలు దేశ వృద్ధికి కొత్త దిశ

- ఒకప్పుడు దేశ తయారీ, నాణ్యత ఉన్నతమైనవి
- ఆ వైభవాన్ని తిరిగి పొందాలి
- స్వావలంబన మంత్రంతో ముందుకు సాగాలి : ప్రధాని మోదీ
- నేటి నుంచి జీఎస్టీ బచత్ ఉత్సవ్ ప్రారంభం



న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ

జీఎస్టీ సంస్కరణలు దేశ వృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తాయని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. గతంలో దేశ తయారీ, నాణ్యత ఉన్నతంగా ఉండేవని, ఆ వైభవాన్ని తిరిగి పొందాలని ఆయన చెప్పారు. ఆదివారం ఆయన జాతినుద్దేశించి ప్రసంగించారు. నేటి నుంచి 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' ప్రారంభమవుతుండడంతో ప్రధాని మోడీ స్వదేశీని స్వీకరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. స్వావలంభన మంత్రంతో ముందుకు సాగాలని ప్రజలకు సూచించారు. దేశ ప్రజలకు ఏది అవసరమో.. దేశీయంగా ఏం తయారు చేయగలమో దాన్ని -మిగతా 3 లో

## అట్టహాసంగా 'కాకతీయ నృత్య నాటకోత్సవాలు' ప్రారంభం



- పాల్గొన్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- మంత్రులు పొంగులేటి, జూపల్లి, సురేఖ, సీతక్క

వరంగల్

హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో తెలంగాణ ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న కాకతీయ నృత్య నాటకోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, -మిగతా 3 లో

## వచ్చే మూడ్రోజులు భారీ వర్ష సూచన

- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక
- హైదరాబాద్‌లో వచ్చే 48 గంటల్లో మోస్తరు వాన
- రాష్ట్రంలో ఆదివారం 525 ప్రాంతాల్లో వర్షం
- 25 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం..
- వాయుగుండంగా మారే అవకాశం




## రాష్ట్రాలపై పెరుగుతున్న భారం





- కేంద్రం నుంచి సహాయ నిరాకరణ
- దశాబ్దకాలంలో 2.5 రెట్లు పెరిగిన రాష్ట్రాల నిబద్ధ వ్యయం
- కాగ్ వెల్లడి

న్యూఢిలీ

: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న సహాయ నిరాకరణ విధానాల కారణంగా రాష్ట్రాలపై ఆర్థికంగా పెనుభారం పడుతోంది. ఉద్యోగుల వేతనాలు, ఫించన్లు, రుణాలకు వడ్డీ చెల్లింపులు వంటి నిబద్ధ వ్యయం (కమిటెడ్ ఎక్స్‌పెండేచర్) తడిసిమోపెడవుతోంది. దశాబ్దకాలంలో అన్ని రాష్ట్రాల నిబద్ధ వ్యయం 2.49 రెట్లు పెరిగి 2022-23 నాటికి రూ.15,63,649 కోట్లకు చేరింది. 2013-14లో ఈ నిబద్ధ వ్యయం రూ.6,26,849 కోట్లుగా ఉండేది. వేతనాలు, ఫించన్లు, ప్రజా రుణాలపై వడ్డీ చెల్లింపులు, బాధ్యతలను 'నిబద్ధ వ్యయం'గా పరిగణిస్తారు. కేంద్ర కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై ఆదివారం -మిగతా 3 లో

# పొరుగు దేశాలు కలిసివుండటం నేర్చుకోవాలి

కశ్మీర్ సమస్యకు పరిష్కారంతోనే శాంతి
పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్



**లండన్ - ప్రజా స్వేచ్ఛ**
పొరుగు దేశాలు పరస్పర సహకారంతో కలిసివుండటం నేర్చుకోవాలని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. లండన్‌లో ఆదివారం ప్రవాస పాకిస్థానీయుల సదస్సులో ఆయన ప్రసంగించారు. కశ్మీర్ సమస్యను పరిష్కరించకుండానే భారత్– పాక్ మధ్య సాధారణ సంబంధాలు ఏర్పడతాయని ఎవరైనా విశ్వసిస్తున్నారంటే.. వారు భ్రమలో జీవిస్తున్నట్లేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రాంతీయంగా శాంతిని నెలకొల్పేందుకు భారత్ ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. భారత్– పాక్ రెండూ పొరుగు దేశాలని, కలిసి ఉండటం నేర్చుకోవాలని తెలిపారు. అయితే, కశ్మీర్ సమస్యకు పరిష్కారం లభించనంత వరకు ద్వైపాక్షిక సంబంధాలు సాధారణ స్థితికి చేరుకోలేవు అని చెప్పారు. కశ్మీరీ ప్రజల త్యాగాలను వృథా కానివ్వబోమని, భారత్ సహకారం అందించే బదులు.. పోరాట ధోరణిని అవలంబిస్తోందని విమర్శించారు. పహల్గాం ఘటనపై దర్యాప్తు చేయడానికి ఒక అంతర్జాతీయ కమిటీని ఏర్పాటు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. శాంతియుతంగా జీవించాలా? లేదా పోరాటం కొనసాగించాలా అనేది మన చేతుల్లోనే ఉందని ఆయన ప్రవాసీయులను ఉద్దేశించి పేర్కొన్నారు. అలాగే భారత్‌తో నాలుగు యుద్ధాలు చేశామని, ఇందుకోసం బిలియన్ల డాలర్లు ఖర్చుయ్యాయని తెలిపారు. ఆ నిధులను పాక్ ప్రజల అభివఅద్ధికి ఉపయోగించాల్సివుండేదని పేర్కొన్నారు. ఇజ్రాయెల్– హమాస్ యుద్ధాన్ని ప్రస్తావిస్తూ.. గాజాలో 65 వేల మందికిపైగా ప్రజలు ప్రాణత్యాగం చేశారన్నారని, ఇజ్రాయెల్ దురాగతాలకు పాల్పడుతోందని విమర్శించారు.

# ఏ రాష్ట్రంపైనా ఏ భాషనూ రుద్దడం లేదు

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



**చెన్నరు - ప్రజా స్వేచ్ఛ**
: కేంద్ర ప్రభుత్వం ఏ రాష్ట్రంపైనా ఏ భాషనూ బలవంతంగా రుద్దడం లేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఐఐట మద్రాస్‌లో ఆదివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. త్రిభాషా అంశంపై పార్లమెంటులో ఇప్పటికే స్పష్టత ఇచ్చామని, అయితే కొందరు రాజకీయ ప్రేరేపితంగా పదేపదే విమర్శలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తమిళనాడు పాఠశాలలో తమిళం, ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ, మలయాళం, కన్నడ వంటి అనేక భాషలు బోధిస్తున్నారని, తమిళం, ఇంగ్లీష్ కాకుండా అనేక భాషలు బోధిస్తున్నప్పుడు మూడో భాషతో ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. 'ఒకటి నుంచి ఐదు వరకు రెండు భాషలు, ఆరు నుంచి పది వరకు మూడు భాషలు బోధించాలి. మాతృభాష తప్పనిసరి. మిగతా రెండు.. విద్యార్థుల ఐచ్ఛికాలు. కేంద్ర ప్రభుత్వం ఏ భాషనూ బలవంతంగా రుద్దడం లేదు. రాజకీయ భావజాలం ఉన్నవారు మాత్రమే దీన్ని వ్యతిరేకిస్తున్నారు. సమాజంలో కొత్త ఆలోచనను సఅష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు' అని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు.

# బాలికపై సామూహిక అత్యాచారం..

నలుగురు అరెస్ట్



**రాంచీ: - ప్రజా స్వేచ్ఛ**
నలుగురు వ్యక్తులు బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. జార?ండ్‌లోని గొడ్డా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 17 ఏళ్ల బాలిక బోరిజోర్‌లోని బంధువుల ఇంటికి చేరుకున్నది. శుక్రవారం స్థానిక సంతకు ఆమె వెళ్లింది. ఈ సందర్భంగా ఆ యువతికి ఒక వ్యక్తి పరిచయమయ్యాడు.కాగా, బాలికను మభ్యపెట్టిన ఆ వ్యక్తి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ అతడి ముగ్గురు స్నేహితులు కలిశారు. నలుగురు కలిసి ఆ యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత బాలిక ఈ విషయాన్ని తన కుటుంబానికి చెప్పింది. దీంతో వారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులైన నలుగురు వ్యక్తులను గుర్తించి వారిని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఈసారి శీతాకాలం భారత్‌లో పంజా విసరనున్న చలి..!

**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
త్వరలోనే శీతాకాలం ప్రారంభం కానున్నది. ఈ ఏడాది వర్షాలు భారీగా కురిశాయి. దాంతో ఈ ఏడాది శీతాకాలంలో చలి బాగా ఉంటుందా? అన్న చర్చ సాగుతుంది. లా నినా పరిస్థితులు ఏర్పడడంతో శీతాకాలంపై ప్రభావం చూపుతుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. లా నినా చల్లటి వాతావరణాన్ని సూచిస్తుందని.. లా నినా ఎల్ నినోకు వ్యతిరేకమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. లా నినా కారణంగా భారత్‌లో.. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో ఎక్కువగా చలి ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రం చల్లబడడం కారణంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో ఉత్తరభారతంలో మరింత మంచు కురుస్తుందని.. చలిగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ




నిపుణులు పేర్కొంటున్నారు. యూఎస్ నేషనల్ వెదర్ సర్వీస్ వాతావరణ అంచనా కేంద్రం అక్టోబర్, డిసెంబర్ మధ్య లా నినా అభివృద్ధి చెందే అవకాశం 71 శాతం ఉంటుందని అంచనా వేసింది.ప్రపంచ వాతావరణ సంస్థ సెప్టెంబర్ ప్రారంభంలో లా నినా దృగ్విషయాన్ని ప్రకటించింది. తాత్కాలిక శీతల ప్రభావం ఉన్నప్పటికీ చాలా దేశాలలో ప్రపంచ ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా ఉంటాయని సంస్థ అంచనా వేసింది. భారత్‌లో భారీ వర్షాలు కురిశాయని.. ఈ క్రమంలో ప్రజలు తీవ్రమైన చలిని ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. పసిఫిక్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ ల్యాబ్ ప్రకారం.. లా నినా భూమధ్యరేఖ పసిఫిక్‌లో అసాధారణంగా చల్లని సముద్ర ఉష్ణోగ్రతల ద్వారా వర్గీకరించబడుతుందని.. అయితే ఎల్ నినో భూమధ్యరేఖ పసిఫిక్‌లో అసాధారణంగా వెచ్చని సముద్ర ఉష్ణోగ్రతల ద్వారా వర్గీకరిస్తారన్నారు. పసిఫిక్ మహాసముద్రంలో కాలానుగుణ నమూనా అయిన లా నినా, భూమధ్యరేఖ పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే తగ్గడానికి కారణమవుతుందని.. భారత్ భూమధ్యరేఖకు సమీపంలో ఉన్న లా నినా ప్రభావితమైన దేశమని.. లా నినా ముఖ్యంగా ఉత్తర భారత రాష్ట్రాల్లో తీవ్రమైన చలిని కలిగిస్తుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

# శత్రువులపై చర్యలు తీసుకోవాలి'..

రహస్య మెసేజ్‌ను పొరపాటున ఆన్‌లైన్‌లో పెట్టిన ట్రంప్..!

**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రాజకీయ శత్రువులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని.. అటార్నీ జనరల్ పామ్ బోండీ కి సూచించారు. ఈ మేరకు ఆయన ఆన్‌లైన్‌లో ఒక మెసేజ్ పెట్టారు. అయితే ఆ మెసేజ్‌ను ఆయన బోండీకి వ్యక్తిగతంగా పెట్టబోయి, పొరపాటున ఆన్‌లైన్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. ఈ పోస్టుపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది.అసలేం జరిగిందంటే.. తన రాజకీయ శత్రువులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అటార్నీ జనరల్ పామ్ బోండీకి ట్రంప్ సూచన చేయదలిచారు. అందులో భాగంగా 'మనం ఇక ఆలస్యం చేయలేం.




ఇది మన కీర్తి, విశ్వసనీయతను చంపేస్తుంది. వారు నన్ను రెండుసార్లు అభిశంసించారు. అభియోగాలు మోపారు. న్యాయం జరగాల్సిన సమయం వచ్చింది' అని మెసేజ్ చేశారు.మాజీ ఎఫ్‌బీఐ డైరెక్టర్ జేమ్స్ కోమీ, కాలిఫోర్నియా డెమోక్రటిక్ సెనెటర్ ఆడమ్ షిఫ్, న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్‌ను ఉద్దేశిస్తూ ఆయన ఆ పోస్టు పెట్టారు. ఎందుకంటే కొంతకాలంగా వారితో ట్రంప్‌కు వైరం నడుస్తోంది. ఈ క్రమంలో వారిపై చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతోనే ట్రంప్ ఈ పోస్టు పెట్టినట్లు తెలుస్తోంది. ట్రంప్ పోస్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.బోండీకి వ్యక్తిగతంగా మెసేజ్ పెట్టబోయి ట్రంప్ ఆన్‌లైన్‌లో పెట్టి ఉంటారని నెటిజన్‌లు కామెంట్స్ పెడుతున్నారు. అయితే దీని గురించి అమెరికా అధికారులు స్పందించలేదు. ఇదిలావుంటే బోండీని ప్రశంసిస్తూ ట్రంప్ మరో పోస్టు పెట్టారు. యూఎస్ అటార్నీ జనరల్‌గా ఆమె అద్భుతంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. కానీ, తన విధానాలను ముందుకు తీసుకెళ్లేందుకు వర్జీనియాలోని లిండ్సే హాలిగాన్ వంటి ప్రాసిక్యూటర్ అవసరమని అభిప్రాయపడ్డారు. ఆమెను యూఎస్ అటార్నీగా నామినేట్ చేస్తానని ట్రంప్ ప్రకటించారు. లిండ్సే అందరికీ సమాన న్యాయం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

# ఉత్తరప్రదేశ్‌లో స్కూల్ టీచర్ పై సామూహిక లైంగికదాడి..



**లక్నో - ప్రజా స్వేచ్ఛ**
ఉత్తరప్రదేశ్ బారబంకిలో దారుణం చోటు చేసుకుంది. ప్రైవేట్ స్కూల్ టీచర్‌ను ఇద్దరు దుండగులు లైంగికదాడి చేసి హతమార్చారు. ఈ ఘటనపై అక్కడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్కూల్ నుంచి ఇంటికి వస్తున్న 45ఏళ్ల ఉపాధ్యాయురాలిని ఆమెకు తెలిసిన రాజువర్మ అనే వ్యక్తి లిఫ్ట్ ఇస్తానని బైక్ ఎక్కించుకున్నాడు. ఆమెను మసౌలీ సమీపంలో ఉన్న కాలువ దగ్గరికి తీసుకెళ్లాడు. అతని స్నేహితుడు భూపేంద్రతో కలిసి ఆమెపై అత్యాచారం చేశారు. అనంతరం చున్నీతో గొంతు బిగించి హత్య చేసి శవాన్ని కాలువలో పడేశారు. ఆమె కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు ఫైల్ చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. దీంతో ఆమె మృతదేహం కాలువలో లభ్యమైంది. నిందితులు రాజు వర్మ, భూపేంద్రను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. విచారణలో నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. అత్యాచారం, హత్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# నేపాల్ నుండి చైనాకు ప్రత్యక్ష విమాన సర్వీసులు




**ఖాట్మండు - ప్రజా స్వేచ్ఛ**
తమ దేశం నుండి చైనాకు ప్రత్యక్ష విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు నేపాల్ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. నేపాల్ రాజధాని ఖాట్మండు నుండి చైనాలోని గ్వాంగ్‌జౌకు గురువారం నుండి ప్రత్యక్ష విమానాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. మొదటిసారిగా ఖాట్మండు– గ్వాంగ్‌జౌ–ఖాట్మండు విమానసర్వీసు కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు నేపాల్ ఎయిర్‌లైన్స్ కార్పోరేషన్ (ఎన్‌ఎజి) ప్రతినిధి మనోజ్‌కుమార్‌షా తెలిపారు. ఈ లైన్‌లో వారానికిమూడు విమానాలు తిరుగుతాయని అన్నారు. మొదటి విమాన సర్వీసు గురువారం, రెండవది సెప్టెంబర్ 28 షెడ్యూల్ చేయబడ్డాయని అన్నారు. ఆ తర్వాత, ప్రతి ఆది, మంగళ, శనివారాల్లో గ్వాంగ్‌జౌకు సర్వీసులు ఉంటాయని ఆయన వివరించారు. ఈ సర్వీసుల ప్రారంభంతో నేపాల్ జాతీయ ఎయిర్‌లైన్ సంస్థ ఇప్పుడు తొమ్మిది దేశాలకు విమాన సర్వీసులను నడుపుతోందని ఎన్‌ఎసి తెలిపింది.

# విద్యాహక్కు చట్టాన్ని సవరించాలి

ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్ - ప్రజా స్వేచ్ఛ**
విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23 (2)ను సవరిస్తూ, టెట్ పరీక్ష నుంచి మినహాయింపునిస్తూ చట్టాన్ని సవరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కిషన్ రెడ్డి స్పందిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా ఏకీకృత సర్వీస్



నిబంధనల అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రతిపాదనలు పంపిస్తే కేంద్ర హోంశాఖ నుంచి ఉత్తర్వులు ఇప్పిస్తానని మాటిచ్చారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పుల్గం దామోదర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి, నాయకులు నవీన్ రెడ్డి, గిరిధర్ తదితరులున్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# నేటి నుంచే కొత్త జీఎస్టీ..

(మొదటి తరువాయి)

ప్యాకేజ్ ఆహారం.. అనగా బిస్కట్లు, స్నాక్స్, జ్యూస్‌లు
కండెన్స్‌డ్ పాలు,డెయిరీ ఉత్పత్తులు
హెయిర్ ఆయిల్, షేవింగ్ క్రీమ్, టాల్కమ్ పౌడర్, ఫేస్ పౌడర్
కాఫీ, ఐస్‌క్రీమ్‌లు
సైకిళ్లు, స్టేషనరీ, స్కూల్ ఆఫీస్ సామాన్లు (పెన్సిళ్లు, నోట్‌బుక్స్)
దుస్తులు, పాదరక్షలు
ఔషధాలు, గ్లూకోమీటర్లు, డయాగ్నస్టిక్ సేవలు 18 శాతం పరిధిలోకి వచ్చేవి:
గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్: ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు, డి ష్ వాషర్లు, పెద్ద తెర ఉన్న టెలివిజన్లు.
గృహ నిర్మాణం సిమెంట్, నిర్మాణ సామగ్రి
ఆటోమొబైల్స్: ద్విచక్ర వాహనాలు చిన్న కార్లు (1200 సీసీ కన్నా తక్కువ) ఇన్సూరెన్స్, ఫైనాన్స్
బీమా, ఆరోగ్య బీమా పాలసీలు
40% పన్ను పరిధిలోకి వచ్చేవి..
పొగాకు ఉత్పత్తులు, మద్యం, పాన్ మసాల
ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ వేదికలు.
లగ్జరీ వాహనాలు, ప్రీమియం లిక్కర్
3500 సీసీ కన్నా ఎక్కువ సామర్థ్యం ఉన్న లగ్జరీ ద్విచక్ర వాహనాలు
కోకా కోలా, పెప్సీ లాంటి సాఫ్ట్ డ్రింక్‌లు.

**జీఎస్టీ సంస్కరణలతో వృద్ధి వేగవంతం: మోదీ**

దేశంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే జీఎస్టీ సంస్కరణలు భారత వృద్ధిని వేగవంతం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నొక్కి చెప్పారు. ఇది ఆత్మ నిర్భర్ భారత్ కోసం ఒక పెద్ద, అతిముఖ్యమైన అడుగు అని, స్వదేశీ ఉత్పత్తులకు ప్రోత్సాహాన్నిచ్చి దేశ శ్రేయస్సుకు అనుసంధానిస్తుందని ఉద్ఘాటించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జాతినుద్దేశించి ప్రసంగించిన ఆయన సవరించిన జీఎస్టీ రేట్ల అమలును గుర్తు చేశారు. విదేశీ మూలాల వస్తువులు తెలియకుండానే ప్రజల దైనందిన జీవితంలో భాగమయ్యాయని, ఈ క్రమంలో స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని ఆయన కోరారు.

# సిద్దిపేట ఎవరి జాగీరు కాదు

(మొదటి తరువాయి)

అలాగే అక్కడ గ్రామ మహిళలతో కొద్దిసేపు బతకమ్మ ఆడారు. లక్ష్మీదేవిపల్లి స్టేజీ వద్ద మహిళలతో కలిసి బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. అనంతరం స్వగ్రామం చింతమడకకు చేరుకున్నారు. ఈ క్రమంలో డప్పుచప్పులతో ఆమెకు మహిళలు స్వాగతం పలకగా.. ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఇంట్లో బతుకమ్మను పేర్చి రామాలయం ముందు ఉన్న గ్రౌండ్‌లో బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. 2005కు ముందు తాను ఎన్నోసార్లు గ్రామానికి వచ్చి వెళ్లే దాన్నని, ఆ తర్వాత ఉద్యమంలో బిజీగా మారి ఇక్కడికి రాలేకపోయానని అన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు సిద్దిపేటకు రావాలన్నా, చింతమడకకు రావాలన్న ఎన్నో ఆంక్షలు ఉన్నాయని తెలిపారు. ఇదే చింతమడక గడ్డలో పుట్టిన కేసీఆర్.. ఇక్కడి ప్రజల అండదండలతో, వారిచ్చిన ఆత్మస్థైర్యంతో తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేసి రాష్ట్రాన్ని సాధించి ప్రజలకు సుపరిపాలనను అందించారని అన్నారు. ఆయన చాటున కొందరు అక్రమాలకు పాల్పడి చంద్రుడు లాంటి తన తండ్రికి మచ్చ తీసుకువచ్చారని తెలిపారు.



ఆ విషయాన్ని తాను బయటపెట్టినందుకు కుటుంబంలో గొడవలు పెట్టి తల్లిని పిల్లను ఎడబాపారని ఆవేదన వ్యక్తం చేశారు. కచ్చితంగా వారి భరతం పడతానంటూ హెచ్చరించారు. తాను సిద్దిపేటకు, చింతమడకకు రాకుండా ఎన్నో ఆంక్షలు పెడుతున్నారని.. ఆంక్షలు పెడితే ఒక్కసారి కాదు వందసార్లు వచ్చి తన సత్తా చూపిస్తానని తెలిపారు. తనకు చింతమడక జన్మ భూమి అని, రానున్న రోజులు కర్మ భూమి కావచ్చున్నారు. దుఖంలో ఉన్న తనకు చింతమడక ప్రజలు ప్రేమను పంచారనీ, భవిష్యత్తులో అండగా నిలవాలని చెబుతూ కంటతడి పెట్టారు.

# స్వదేశీ వస్తువులే వాడండి

(మొదటి తరువాయి)

దేశీయంగానే తయారు చేయాలని పిలుపునిచ్చారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు, నియమాలు, నిబంధనలు, విధానాల సరళీకరణతో ఎంఎస్ఎంఈలు, చిన్న తరహా, కుటీర పరిశ్రమలు ఎంతో ప్రయోజనం పొందుతాయన్నారు. అమ్మకాలు సైతం పెరుగుతాయన్నారు. వాటి పై తక్కువ పన్ను చెల్లించాల్సి ఉంటుం దన్నారు. దేశ శ్రేయస్సు శిఖరాగ్రంలో ఉన్నప్పుడు చిన్న తరహా కుటీర పరిశ్రమలు ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైనవన్నారు. మన పరిశ్రమలు ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉండాలని, మనం ఉత్పత్తి చేసే వస్తువులు ప్రపంచంలోని అత్యుత్తమ ప్రమాణాలను అధిగమించాలని పిలుపునిచ్చారు. గత 11 ఏండ్లలో 250 మిలియన్ల మంది ప్రజలు పేదరికాన్ని అధిగమించారని తెలిపారు. 1.2 మిలియన్ల వరకు ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపులు మధ్య తరగతికి గణనీయమైన ఉపశమనాన్ని అందించాయన్నారు. జీఎస్టీ సంస్కరణలు గృహ నిర్మాణం, స్కూటర్లు, కార్లు, హోటల్స్ వంటి ఖర్చులను తగ్గిస్తాయన్నారు. పేదలు, నవ మధ్యతరగతి రెండింతలు ప్రయోజనం పొందుతారని ఆయన వెల్లడించారు. వివిధ రాష్ట్రాల్లో పన్నులు, టోల్‌ల సంక్లిష్టతల నుంచి విముక్తి కంపెనీలకు ఒక సవాలుగా ఉందన్నారు. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వస్తువులను రవాణా చేయడం చాలా కష్టంగా ఉందని, కంపెనీలు యూరప్‌కు రవాణా చేయడానికి ఇష్టపడతాయన్నారు. కొత్త సంస్క రణలు వ్యాపారాన్ని సులభతరం చేస్తాయని, వినియోగదారులపై భారాన్ని తగ్గిస్తా యని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు పెట్టుబడులను ఆకర్షిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. అభివృద్ధి పథంలో ప్రతీ రాష్ట్రాన్ని సమానంగా కలుపుతాయని వెల్లడించారు. 2017లో జీఎస్టీ అమలు ఒక చారిత్రాత్మక అడుగు అని, ఇప్పుడు కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని తెలిపారు. పేదలు, మధ్యతరగతి, రైతులు, మహిళలు, దుకాణదారులు, వ్యవస్థాపకులు అందరూ ఈ సంస్కరణ లతో ప్రయోజనం పొందుతారన్నారు. కొత్త తరం జీఎస్టీ సంస్కరణలు 'నాగరిక దేవో భవ'ను ప్రతిబింబిస్తాయన్నారు. నవరాత్రి మొదటి రోజు నుంచి ఆత్మనిర్భర్ భారత్ వైపు దేశం అడుగులు వేస్తుందన్నారు. వన్ నేషన్ వన్ ట్యాక్స్ కల సాకారమైందని అన్నారు. ఐటీ మినహాయింపు పరిమితి పెంపు, జీఎస్టీ సంస్కర ణలు ప్రజలకు రూ. 2.5 లక్షల కోట్లు ఆదా చేస్తాయన్నారు. 2017లో జీఎస్టీ సంస్కరణ ప్రారంభించినప్పుడు పాత చరిత్రను అది మార్చిందని, ప్రస్తుత జీఎస్టీ సంస్కరణలు కొత్త చరిత్ర సృష్టించడానికి నాంది పలికిందని అన్నారు. ప్రతిరోజూ అవసరమైన వస్తువులు పన్ను రహితంగా లేదా 5శాతం లేదా 18శాతం జీఎస్టీ కింద ఉంటాయని చెప్పారు. 12శాతం పన్ను ఉన్న 99శాతం వస్తువులు 5శాతం పన్నులోకి వచ్చా యని, పేదలు వాడే అనేక వస్తువులపై సున్నా శాతం జీఎస్టీ ఉంటుందని చెప్పారు. ఆహార పదార్థాలు, ఔషధాలు, సబ్బులు, బ్రష్, పేస్ట్, హెల్త్ అండ్ ఇన్సూరెన్స్, ఇంకా పలు వస్తువులు, సేవలు జీరో టాక్స్ లేదా 5 శాతం పన్నుకే పరిమితమవుతాయని చెప్పారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు డబుల్ బొనాంజాగా అభివర్ణించారు.

# వచ్చే మూడ్రోజులు భారీ వర్ష సూచన

**పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక**
**హైదరాబాద్‌లో వచ్చే 48 గంటల్లో మోస్తరు వాన**
**రాష్ట్రంలో ఆదివారం 525 ప్రాంతాల్లో వర్షం**
**25 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం..**
**వాయుగుండంగా మారే అవకాశం**

**హైదరాబాద్**

రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, నిజామాబాద్, రంగారెడ్డి, నిర్మల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఈ నెల 25 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందనీ, అది వాయుగుండంగా మారి 27న దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర కోస్తా ప్రాంతంలో తీరం దాటే అవకాశముందని తెలిపారు. ఆదివారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 525 ప్రాంతాల్లో వర్షం కురిసింది. 20 ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. రాష్ట్రంలో అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో 11.4 సెంటీమీటర్ల భారీ వర్షపాతం రికార్డయింది. జనగామ జిల్లా దేవరుప్పలలో 11.1 సెంటీమీటర్ల వాన పడింది. వచ్చే 48 గంటల పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే సూచనలు బలంగా ఉన్నాయి.

# అట్టహాసంగా 'కాకతీయ నృత్య నాటకోత్సవాలు' ప్రారంభం

(మొదటి తరువాయి)

కొండా సురేఖ, దనసరి సీతక్కతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. ముందుగా ప్రముఖ నాట్య గురు, అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య డాక్టర్ అలేఖ్య పుంజాల ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ కూచిపూడి నృత్య రూపకం, ఓరుగల్లు చరిత్ర కాకతీయ వైభవం గుర్తు చేస్తూ రాణిరుద్రమ చారిత్రక నాటకం, ప్రజా సాహిత్య కళారూపాలు ప్రదర్శనలు నిర్వహించారు. డాక్టర్ అలేఖ్య పుంజాల నృత్య దర్శకత్వంలో 30 మంది కళాకారులు చిట్యాల ఐలమ్మ జీవిత చరిత్రను కూచిపూడి నృత్య రూపకంలో ప్రజలను హత్తుకునేలా ప్రదర్శించారు. ఈ నృత్య రూపకాన్ని డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ రచించగా, సంగీత దర్శకులు వీబీఎస్ మురళి సంగీతం సమకూర్చారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కళాకారులను ఘనంగా సత్కరించారు. అంతకుముందు హనుమకొండ జిల్లా పర్యటనకు విచ్చేసిన వారికి హోటల్ హరిత కాకతీయలో వారిని ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ డాక్టర్ బండా ప్రకాష్, బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మెన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, వరంగల్ నగర సీపీ సన్‌ప్రీత్ సింగ్, సీఎండీ వరుణ్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ వాజ్‌పేయి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాలస్తీనా దేశమే..

(మొదటి తరువాయి)

గాజాలో కాల్పుల విరమణకు, ఐరాస సాయం అనుమతికి, దీర్ఘకాలిక శాంతికి ఇజ్రాయిల్ అంగీకరించకపోతే.. పాలస్తీనాను దేశంగా గుర్తిస్తా మని జులైలోనే స్టార్మర్ ప్రకటించారు. ఇటీవల బ్రిటన్ పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్టార్మర్ ప్రభుత్వ ప్రణాళిక లను వ్యతిరేకించారు. ఈ విషయంలో ప్రధాని స్టార్మర్ తో విభేదాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు 140కి పైగా దేశాలు పాలస్తీనాను దేశంగా గుర్తించాయి. త్వరలోనే ఫ్రాన్స్ తదితర దేశాలూ ఈమేరకు ప్రకటనలు చేయనున్నట్లు సమాచారం.

**ఏమిటీ ద్విదేశ పరిష్కారం**

పాలస్తీనాను దేశంగా గుర్తించే విషయంలో బ్రిటన్ తదితర దేశాల ప్రణాళికలను అమెరికా, ఇజ్రాయిల్ దేశాల ప్రతినిధులు ఇప్పటికే ఖండించారు. ఉగ్రవాదంతోపాటు 2023 అక్టోబరు 7నాటి దాడుల విషయంలో హమాస్‌కు బ్రిటన్ బహుమతి ఇచ్చినట్టు ఇజ్రాయిల్ విదేశాంగశాఖ విమర్శించింది.

**ఇజ్రాయిల్ దాడుల్లో 55 మంది మృతి**

ఆదివారం ఉదయం నుంచి గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో 55 మంది పాలస్తీయన్లు మరణించారు. గాజా నగరంలోనే 37 మంది చనిపోయినట్టు అధికారవర్గాలు ధ్రువీకరించాయి. మరోవైపు ఆకలికోరల్లో చిక్కి మరో చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. దీంతో ఆకలితో చనిపోయిన వారి సంఖ్య మరింతగా అధికమవుతోంది. దీనిపై పౌర హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి

# 30 నాటికి ఎస్ఐఆర్ అమలుకు సిద్ధంగా ఉండండి

(మొదటి తరువాయి)

అక్టోబర్, నవంబర్‌ల్లో దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ సమావేశంలో ముందుగా 10 నుంచి 15 రోజుల్లో ఎస్ఐఆర్‌కు సిద్ధంగా ఉండాలని కోరిన ఎన్నికల సంఘం మరింత స్పష్టత కోసం ఈ నెల 30 నాటికి సిద్ధంగా ఉండాలని పేర్కొంది. రాష్ట్రాల్లో చివరిసారిగా జరిగిన ఎస్ఐఆర్ తరువాత ప్రచురించిన ఓటర్ల జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలని కూడా సిఇఓలకు తెలిపింది. దీంతో అనేక రాష్ట్రాల సిఇఓలు ఇప్పటికే తమ రాష్ట్రాల్లో చివరి ఎస్ఐఆర్ తరువాత ప్రచురించిన ఓటర్ల జాబితాలను తమ వెబ్‌సైట్లలో ఉంచారు. ఢిల్లీ ఇసిఒ వెబ్‌సైట్‌లో 2008 నాటి ఓటర్ల జాబితా ఉంది. ఉత్తరాఖండ్‌లో 2006 ఓటర్ల జాబితా ఉంచారు. చివరిసారిగా జరిగిన ఎస్ఐఆర్‌నే కటాఫ్ డేట్‌గా పరిగణనలోకి తీసుకుంటారు. ఎక్కువ రాష్ట్రాల్లో 2002 నుంచి 2004 మధ్య చివరిసారిగా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించారు. ప్రస్తుతం బీహార్‌లో 2003 ఓటర్ల జాబితాను ఎస్ఐఆర్ కోసం ఉపయోగిస్తున్నారు. బీహార్ తరువాత దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహిస్తామని ఎన్నికల సంఘం ఇప్పటికే తెలిపింది. వచ్చే ఏడాది కాలంలో బీహార్‌తో పాటు తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కాబట్టి దేశవ్యాప్త ఎస్ఐఆర్ ప్రాధాన్యతను సంతరించుకుంది.

# రాష్ట్రమంతా సౌభాగ్యంగా ఉండాలి

(మొదటి తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ బతుకమ్మ పండుగ తొమ్మిది రోజుల ఫలవంతం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మహిళలంతా ఆర్థికంగా ఎదగడంతో పాటు శక్తివంతులుగా ఎదగాలని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆడపడుచులకు అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క స్వయంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటల సీడీని మంత్రులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజ్, గండ్ర సత్యనారాయణ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# అఫ్గానిస్థాన్‌కు ట్రంప్ బెదిరింపులు

(మొదటి తరువాయి)

తాను తీసుకునే నిర్ణయం చాలా కఠినంగా ఉంటుందని హెచ్చరించారు. ఇదే విషయంపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బగ్రామ్ వైమానిక స్థావరం స్వాధీనం చేసుకునే అంశంపై అఫ్గాన్‌తో చర్చలు జరుపుతామన్నారు. దాన్ని తిరిగి తీసుకుంటామని వారు అలా చేయకపోతే తాను ఏం చేస్తానో ఎవరూ ఊహించలేరని వ్యాఖ్యానించారు. వైమానిక స్థావరాన్ని స్వాధీనం చేసుకునేందుకు అమెరికా దళాలను అక్కడికి పంపుతారా అని ఈ సందర్భంగా ఓ విలేకరి ప్రశ్నించగా.. బదులిచ్చేందుకు ట్రంప్ నిరాకరించారు. చైనా అణు క్షిపణులు తయారు చేసే ప్రదేశానికి సమీపంలో ఉన్న అత్యంత వ్యూహాత్మకమైన బగ్రామ్ వైమానిక స్థావరాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని అనుకుంటున్నట్టు ఇటీవల ట్రంప్ ప్రకటించారు. చైనా అణ్వాయుధ ఉత్పత్తి కేంద్రాలకు ఇది అతి దగ్గరగా ఉంటుందని, కేవలం గంట వ్యవధిలో వెళ్లచ్చని వ్యాఖ్యానించారు. ట్రంప్ నిర్ణయంపై బీజింగ్ స్పందిస్తూ.. అఫ్గాన్ భవిష్యత్తు అక్కడి ప్రజల చేతుల్లోనే ఉందని అభిప్రాయపడింది. ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచడం వల్ల మద్దతు లభించదని ఆ దేశ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ పేర్కొన్నారు. యూఎస్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్టు అఫ్గాన్ అధికారులు ఇప్పటికే పేర్కొన్నారు.

# రాష్ట్రాలపై పెరుగుతున్న భారం

(మొదటి తరువాయి)

ఒక నివేదిక విడుదల చేసింది. 2013-14 నుంచి 2022-23 వరకు పదేళ్ల కాలంలో, రాష్ట్రాల రెవెన్యూ ఖర్చులు.. మొత్తం వ్యయంలో 80-87 శాతంగా ఉందని, ఇది జిఎస్‌డిపిలో సుమారు 13-15 శాతంగా ఉన్నట్లు కాగ్ తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ ఖర్చు.. జిఎస్‌డిపిలో 13.85 శాతంగా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రెవెన్యూ ఖర్చు రూ.35,95,736 కోట్లు కాగా అందులో నిబద్ధ వ్యయం రూ.15,63,649 కోట్లుగా ఉంది. సబ్సిడీలపై రూ.3,09,625 కోట్లు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌పై రూ.11,26,486 కోట్లు ఖర్చు చేశారు. ఈ మూడు మొత్తం రెవెన్యూ ఖర్చులో 83 శాతం కంటే ఎక్కువ అని తెలిపింది. 2013-14లో అన్ని రాష్ట్రాలకు రూ.96,479 కోట్లుగా ఉన్న సబ్సిడీపై ఖర్చు 2022-23లో రాష్ట్రాలకు రూ.3,09,625 కోట్లకు పెరిగింది. 2013-14 నుండి 2022-23 వరకు, రెవెన్యూ ఖర్చు 2.66 రెట్లు, నిబద్ధ వ్యయం 2.49 రెట్లు, సబ్సిడీ 3.21 రెట్లు పెరిగింది అని కాగ్ పేర్కొంది. 2022-23 వ్యయాల్లో వేతనాలు అతిపెద్ద భాగంగా ఉన్నాయి, తరువాత పెన్షన్, వడ్డీ చెల్లింపులు ఉన్నాయి.

# సంపాదకీయం

## పూలకు విన్నపాలు





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

'పూలనుకని మురవని మోముంటుందా! పరిమళాలు హృదిని చేర ఆనందాలు విరియవా!' 'కన్నులకు పండుగలను అందించేవిరులు, కలలను పండించి వికసించే కళలు' అంటూ మైమరిచి గానం చేస్తాడో పుష్ప ప్రేమికుడైన కవి. పువ్వులు ఈ ప్రకృతి మనకందించిన సౌందర్య కానుకలు. అవును పూలను చూసి ఆనందపడని మనసులుండవు. ఏ పువ్వును చూసినా మనసు వికసిస్తుంది. ఒక ఆహ్లాదకర ఆవరణం ఆవిష్కృతమవుతుంది. పువ్వులు మృదుత్వానికి ప్రతీకలు. వర్ణశోభితాలు. సౌరభ సమూహాలు. పరిమళ భరితాలు. అందాల కనువిందులు. పూలను ఉపయోగించే విధానాన్ని మనం పరిశీలించినట్లయితే మానవుని సౌందర్యాత్మకతను గ్రహించగలుగుతాము. మనుషుల్లో పరిణమించిన అనేకానేక భావ ఆవిర్భావాల వ్యక్తీకరణకు పూలను వినియోగించటాన్ని మనం చూస్తాము. ప్రేమ అనే భావనను వ్యక్తపరచటానికి మనకున్న భాషరహిత సాధనం పువ్వులే కదా! ఒక గౌరవాన్ని, అభినందనను, సంతోషాన్ని, ఆనందాన్ని వ్యక్తపరచేందుకు పువ్వులనూ, పూలదండలనే ఉపయోగిస్తాం. స్త్రీ పురుషులిద్దరు జతకట్టే సందర్భం. తోడుగ నిలిచే వివాహ బంధంలోనూ పూలమాలే సాక్ష్యమై నిలుస్తుంది. అనుసంధానిస్తుంది. శృంగార రసావిష్కార కార్యప్రేరణా జ్వాలామణి. మధురాస్వాదనల గని. పువ్వులకు మనలోని భావనలెన్నింటినో ఆపాదించి వర్ణించుకొంటాము. నానారకాల పూలు, ఎప్పుడైనా మనం వాటి గణన చేశామా.. కోకొల్లలు. మల్లెలు, గులాబీలు, సంపెంగలు, మందారాలు, బంతులు, చామంతులు, సన్నజాజులు, కనకాంబరాలు, మొగిలిరేకులు, తంగేడుపూలు, గునుగుపూలు, గడ్డిపూలు, బిల్లగన్నేరు, గుమ్మడిపూలు కలువలు, తామరలు, చెంగల్వలు, పొద్దుతిరుగుడు, ఉమ్మెత్తలు, నందివర్ధనాలు, తులిప్‌లు, నూరువరహాలు, నాగమల్లిపువ్వు, బ్రహ్మకమలం, పారిజాతాలు%ౌ% ఇలా వేలరకాల వేల వర్ణాల పుష్ప విశ్వరూపాన్ని మనం చూడవచ్చు. పూలులేని భూ స్థలంలేదు. ఇట్లాంటి పువ్వులు వాడే సందర్భాలు కేవలం శుభవేలలేకాదు, చివరియాత్రలోనూ ఇవే వీడ్కోలు పలుకుతాయి. చివరి వందనం వీటితోనే చేస్తాము. అమరుల పాదాలకాడ పుష్పాంజలి ఘటిస్తాము. మనకు జ్ఞాపకంగా మిగిలిపోయిన వారి చిత్రానికి వేలాడే మాలలై స్మరిస్తుంటాయి. పూలులేని సందర్భం ఏమున్నది! పెళ్లినిండా పరచుకునేవి అవే. పూల జడలై విరిసేది అవే. ఇంటి అలంకరణకు తమ వొంటినందిస్తాయి. ఇంతి తలలోన తొలి అందమై మెరిసి మురిసిపడతాయి. అంతేకాదు ఆరాధనకూ, భక్తికీ పువ్వులే ఆదరువు. పూలులేని పూజ కనపడదు మనకు. అలాగే విజయానికి గుర్తుగా పూలమాలే దర్శనమిస్తుంది. అతిధులకు స్వాగతం పలికేవీ పూలే. పూలన్ని రకాలు మన అవసరాకు ఉపయోగించడానికి పూనుకుంటూ వాటిని చంపేస్తామని విలపించాడు జంధ్యాల పాపయ్య శాస్త్రి. పూలకు మానవ హృదయాన్ని ఆపాదించి పుష్ప విలాపాన్ని రచించారు. 'మా వెలలేని ముగ్ధ సుకుమార సుగంధ మకరంద మాధురీ/ జీవితమెల్ల మీకయి త్యజించి కృశించి నశించిపోయె/ మా యౌవన మెల్ల కొల్లగొని ఆపయి చీపురుతోడ చిమ్మిమమ్మావల పారబోతురుగదా! నరజాతికి నీతియున్నదా!" అని పువ్వులు ప్రశ్నిస్తున్నాయి. ఇక పువ్వులు అలంకరణ, అందానికే కాదు, అద్భుతమైన ఔషధ తయారీకి ఉపయోగపడతాయి. తేనెటీగలు పూలలోని తేనెను గ్రోలి కమ్మనైన తేనెను మనకందిస్తాయి. పాకృతికమైన రంగులనూ ఇస్తాయి. ఎన్ని విశిష్ట ప్రయోజనాలున్నా పువ్వులనగానే ఆడపిల్లల జతగాళ్లుగానే చూడటం అలవాటయింది మనకు. ఆడపిల్లలూ పువ్వులంటే ఇష్టపడతారు. అలాంటి పువ్వులను పేర్చుకుని, పూజించి, పదిమందీ కలిసి పాటలతో ఆటలతో జరుపుకునే పండగ బతుకమ్మ పండగ. స్త్రీలు మాత్రమే చేసుకునే స్త్రీల పండుగ, తెలంగాణకు మాత్రమే చెందిన పండగగా ప్రసిద్ధి చెందింది. 'బతకమ్మా' అనడంలోనే బతకటానికి ఏవో ఆటంకాలు, అవరోధాలు వచ్చాయన్న ధ్వని వినపడుతుంది. మన సమాజంలో తరతరాలుగా ఆడపిల్లలను తక్కువగా చూడడం, వివక్షతలకు గురిచేయటం చూస్తాము. ఇక పెళ్ళయి మెట్టినింటికి వచ్చాక అనేక ఆంక్షలు, ఒత్తిడులు. స్వేచ్ఛను కోల్పోయి వేదనలకు గురవుతారు. అలాంటి ఒక ఆడకూతురు కథాంశంలోనే 'బతకమ్మ' ఏర్పడి బతుకు యెతలను గాథలుగా తలపోసే సందర్భంగానే ఈ పండుగ ఆవిర్భవించింది. గౌరమ్మ దేవతారూపంగా మార్చి స్త్రీలు పాటలు పాడుకుంటారు. ఇంటి బయట పదిమందితో కలిసి మెలిసి ఆవేదనలను పంచుకుంటారు. ఇదొక గొప్ప సందర్భం. ఇప్పటికీ స్త్రీల సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. లైంగికదాడులు, హత్యలు, వివక్షతలు జరుగుతూనే ఉన్నాయి. స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించనే లేదు.

# ప్యూన్ కొలువు కోసం 25 లక్షల దరఖాస్తులు

**-దరఖాస్తుదారుల్లో ఇంజినీరింగ్, ఎంబిఎ, పిహెచ్‌డి, పిజి అభ్యర్థులు కూడా**

**-బిజెపి పాలిత రాజస్థాన్‌లో నిరుద్యోగతాండవం**



**హైదరాబాద్,- ప్రజా స్వేచ్ఛ**

దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతుంది. చదువుకు తగిన జాబ్ రాకపోవడంతో ఏదో ఒక జాబ్‌లో సెటిలవ్వాలన్న ధోరణిలోకి వచ్చేస్తున్నారు. మరోవైపు కేంద్రంలోని మోడీ సర్కార్ డబుల్ ఇంజిన్ సర్కార్లు వస్తే..ఉద్ధరిస్తామంటూ సమస్యల్ని పట్టించుకోవటంలేదనటానికి ఉదాహరణలు ఎన్నో. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలుఉన్నా భర్తీచేయటంలేదు. నిరుద్యోగం ఎంతగా ప్రబలుతున్నదో చెప్పటానికి బిజెపి పాలిత రాజస్థాన్‌లో ఇటీవల ప్యూన్ పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్‌నే ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. మొత్తం 53,479 ప్యూన్ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానించగా 24.76 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ పోస్టులకు పదో తరగతి అర్హత కాగా.. దరఖాస్తు చేసుకున్నవారిలో డిగ్రీ/బిటెక్, ఎంఎస్‌సి, ఎంబిఎ, లా, పిహెచ్‌డి చేసిన వాళ్లు పెద్ద సంఖ్యలో ఉండటం గమనార్హం. ప్యూన్ పోస్టుల కోసం సుమారు 25 లక్షల మంది దరఖాస్తు చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజస్థాన్‌లో నిరుద్యోగ సమస్య ఏ స్థాయిలో ఉందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చని పలువురు కామెంట్లు పెడుతున్నారు. కాగా, దీనిపై పలువురు ఉద్యోగార్థులు స్పందించారు. 2018 నుంచి పోటీ పరీక్షలకు సిద్దమవుతున్నా. ఇంకా సక్సెస్ కాలేకపోయాను. కనీసం ప్యూన్ జాబ్ వచ్చినా కూడా నిరుద్యోగిగా ఉండే బాధ తప్పుతుందని జైపూర్‌లోని గోపాలపుర ప్రాంతంలో కోచింగ్ తీసుకుంటున్న కమల్ కిశోర్ తెలిపారు. తాను ఎంఎ, బిఇడి పూర్తి చేశానని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ఉద్యోగం రావడం అంటే జీవితానికి భద్రత అన్నట్లే.. ప్యూన్‌గా నీళ్లు ఇవ్వడమైనా సరే.. ఏ అవకాశాన్ని కోల్పోవద్దని భావించామని పీజీ పూర్తి చేసిన తనూజా యాదవ్, ఎంఎ, బిఇడి పూర్తి చేసిన సుమిత్రా చౌదరి అభిప్రాయపడ్డారు. కాగా, ప్యూన్ పోస్టుల కోసం చివరి ఐదు గంటల్లోనే దాదాపు 1.11 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ప్రతి ఆరు సెకన్లకు ఒక అప్లికేషన్ నమోదైంది. ఇంత భారీ ట్రాఫిక్ కారణంగా సైట్ తరచూ క్రాష్ అయ్యింది. దీనివల్ల అప్లికేషన్ ప్రక్రియలో పలువురు సాంకేతిక సమస్యలను ఎదుర్కొన్నారు. కొందరి డాక్యుమెంట్లు అప్‌లోడ్ కాలేవు. దీంతో అప్లికేషన్ గడువును పొడిగించాలని పలువురు నిరుద్యోగులు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను వేడుకుంటున్నారు. చిన్న చిన్న పోస్టులకు లక్షల్లో దరఖాస్తులు రావడం రాజస్థాన్‌లో ఇదే తొలిసారి ఏమీ కాదు. గతంలో 2399 ఫారెస్ట్ గార్డు పోస్టుల కోసం దాదాపు 22 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇదిలా ఉంటే, ప్రస్తుతం రాజస్థాన్‌లో అధికారిక లెక్కల ప్రకారం 18 లక్షల నిరుద్యోగులు రిజిస్టరయ్యారు. అయితే మొత్తం నిరుద్యోగుల సంఖ్య 35 లక్షల వరకు ఉండొొచ్చని అంచనా.

# అక్టోబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు..!

**-బీసీలకు 42 శాతం రిజర్వేషన్..**

**- రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం..**



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి




**హైదరాబాద్,- ప్రజా స్వేచ్ఛ**

అక్టోబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బీసీ రిజర్వేషన్లపై మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి శనివారం కీలక సమావేశం నిర్వహించారు. జీవో ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ స్థానిక ఎన్నికలకు వెళ్లే యోచనలో సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వాహణకు 2 నెలల సమయం ఇవ్వాలని హైకోర్టును కోరబోతోంది ప్రభుత్వం.. బీసీ రిజర్వేషన్ల కోసం చేసిన ప్రయత్నాలను హైకోర్టు వివరించాలని భావిస్తోంది. రెండు నెలల్లో ఎన్నికలు పూర్తి చేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. 2,3 రోజుల్లో మరోసారి మంత్రులతో సీఎం రేవంత్ సమావేశం అవుతారు. కోర్టుకు ఇచ్చే వివరణపై మరోసారి సమీక్ష చేయబోతున్నారు సీఎం రేవంత్ రెడ్డి..

# శ్రీలంక మహిళపై ఈడీ దర్యాప్తు

**చెన్నై - ప్రజా స్వేచ్ఛ**

నిషేధిత తమిళ ఉగ్రవాద సంస్థ లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్టీటీఈ) పునరుద్ధరణకు శ్రీలంక మహిళ ప్రయత్నించింది. నకిలీ పాస్‌పోర్ట్ కేసులో అరెస్టై జైలులో ఉన్న ఆమెపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. మనీలాండరింగ్ ఆరోపణలపై ఆమెను ప్రశ్నించనున్నది. శ్రీలంక జాతీయురాలైన లెచ్చుమనన్ మేరీ ఫ్రాన్సిస్కా 2019 డిసెంబర్‌లో టూరిస్ట్ వీసాపై భారత్‌కు వచ్చింది. అయితే వీసా గడువు ముగిసిన తర్వాత కూడా చెన్నైలో ఉండటంతో పాటు నకిలీ పత్రాల ద్వారా భారత్ పాస్‌పోర్ట్ పొందింది. ఈ నేపథ్యంలో 2021 అక్టోబర్‌లో చెన్నై విమానాశ్రయంలో మేరీ ఫ్రాన్సిస్కాను తమిళనాడు సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. భారత్‌లో అక్రమంగా నివసించడం, నకిలీ పాస్‌పోర్ట్ పొందడం వంటి నేరాలపై ఆమెపై కేసు నమోదు చేశారు.కాగా, నిషేధిత ఎల్టీటీఈ పునరుద్ధరణ, ఆ సంస్థ కార్యకలాపాలకు వనరులను సమీకరించడానికి




మేరీ ఫ్రాన్సిస్కా కుట్ర పన్నినట్లు దర్యాప్తులో బయటపడింది. యాక్టివ్‌గా లేని బ్యాంకు ఖాతాలను యాక్సెస్ చేయడం, ఎల్టీటీఈ క్యాడర్ల పునఃసమూహానికి సహాయపడేందుకు నిధులు మళ్లించేందుకు ఆమె ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయి. ఆమె వాంగ్మూలాల ఆధారంగా టీ కెన్నిస్టన్ ఫెర్నాండో, కే బాస్కరన్ సహా మరో ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు.మరోవైపు ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించారు. డెన్మార్క్‌లో స్థిరపడిన శ్రీలంక తమిళుడు, మాజీ ఎల్టీటీఈ కార్యకర్త ఉమాకాంతన్‌తో శ్రీలంక మహిళకు సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఉమాకాంతన్ సూచనల మేరకు పనిచేస్తున్న ఫ్రాన్సిస్కా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లోని నిష్క్రియాత్మక ఖాతా నుంచి రూ.42 కోట్లకు పైగా మళ్లించేందుకు ప్రయత్నించినట్లు ఎన్ఐఏ ఆరోపించింది. ఈ కుట్రలో భాగంగా సహచరులకు విదేశీ చెల్లింపులు ఆమె జరిపినట్లు దర్యాప్తులో గుర్తించారు.కాగా, 2021 అక్టోబర్‌లో అరెస్ట్ అయినప్పటి నుంచి పుళల్ సెంట్రల్ జైలులో మేరీ ఫ్రాన్సిస్కా ఉన్నది. ఎల్టీటీఈ పునరుద్ధరణ కోసం మనీలాండరింగ్‌కు ఆమె పాల్పడినట్లు ఈడీ ఆరోపించింది. దీంతో జైలు ఆవరణలో రెండు రోజుల పాటు ఆమెను ప్రశ్నించేందుకు కోర్టు అనుమతిని ఈడీ కోరింది. దీనికి అంగీకరించిన కోర్టు 'విచిత్రమైన కేసు'గా అభివర్ణించింది. ఫ్రాన్సిస్కా విచారణ కోసం ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, ఇతర అవసరమైన పరికరాలను ఈడీ అధికారులు జైలులోకి తీసుకెళ్లడానికి కోర్టు అనుమతించింది.

# మోదీ వైఫల్యంతోనే వీసా రుసుం పెంపు

**బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు**



**హైదరాబాద్,- ప్రజా స్వేచ్ఛ**


అమెరికాలో హెచ్-1బీ వీసా రుసుం పెంపుదలకు మనదేశ ప్రధాని మోదీ వైఫల్యమే కారణమని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. భారత్‌పై తరచూ విరుచుకుపడుతున్న ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ వ్యవహారంపై హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు.5 వేల డాలర్లలోపు ఉన్న హెచ్-1బీ వీసా దరఖాస్తు ఫీజును ఏకంగా లక్ష డాలర్లకు పెంచడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఈ రుసుం పెంపుతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు.

# రాష్ట్రమంతా సౌభాగ్యంగా ఉండాలి

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**
**వరంగల్‌లో బతుకమ్మ పండుగ ప్రారంభోత్సవం**
**పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి, జూపల్లి**
**మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన మంత్రులు**



**ప్రజా స్వేచ్ఛ హనుమకొండ చౌరస్తా**
ప్రకృతిలో లభించే అనేక రకాల పూలతో తొమ్మిది రోజులపాటు మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో గౌరమ్మను పూజిస్తారని, వారి పూజలు ఫలప్రదమై రాష్ట్రంతో పాటు రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం రాత్రి తెలంగాణ సంగీత అకాడమీ ఆధ్వర్యంలో కాకతీయ నృత్య ప్రదర్శనతో పాటు వేయి స్తంభాల గుడి వద్ద బతుకమ్మ పండుగ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ పండుగ ప్రారంభం అయిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ బతుకమ్మ పండుగ తొమ్మిది రోజుల ఫలవంతం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మహిళలంతా ఆర్థికంగా ఎదగడంతో పాటు శక్తివంతులుగా ఎదగాలని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆడపడుచులకు అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క స్వయంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటల సీడీని మంత్రులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజ్, గండ్ర సత్యనారాయణ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు


తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



**మెట్ పల్లి – ప్రజా స్వేచ్ఛ**
కాంగ్రెస్ పార్టీ వారి ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధుడు తెలంగాణ పోరాట దీరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి పురస్కరించుకొని ఆదివారం రోజు పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తా దగ్గర ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం చేతుల మీదుగా పూలమాల వేసి ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు.అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, యూత్ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్,ఆడెపు రమణ,గాజా రాజారెడ్డి,జాకీర్,ముకిం, మహేందర్,తాండ్ర నర్సయ్య తదితరులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మరాఠా సంఘ అధ్యక్షులుగా కదం మోహన్ రావు పటేల్



**– ప్రజా స్వేచ్ఛ బైంసా ప్రతినిధి**



పట్టణములోని శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ మరాఠా సంఘం భవనంలో ఆదివారం మరాఠా సంఘం కార్యవర్గం ఎన్నిక జరిగింది.అధ్యక్షులుగా కదం మోహన్ రావు పాటిల్,ఉపాధ్యక్షులుగా సూర్యవంశీ కాశీరాం పాటిల్, సంపత్ పాటిల్,ప్రధాన కార్యదర్శిగా సిందే లక్ష్మణ్ రావు పాటిల్,సహ కార్యదర్శిగా జాదవ్ సాయి కృష్ణ పాటిల్,కోశాధికారిగా సిందే దర్శన్ పాటిల్,ముఖ్య సలహాదారులుగా కదం సునీల్ పాటిల్,జాదవ్ ఉత్తం రావు పాటిల్, సభ్యులుగా డాంగే గణేష్ పాటిల్,జోక్ దండే మోహన్ రావు పాటిల్, కదం దత్తురాం పాటిల్,సూర్యవంశం సాయినాథ్ పాటిల్, సాయినాథ్ పాటిల్ రంగశివుని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులకుమరాఠా సన్ సభ్యులు సన్మానించారు

# బతుకమ్మ, దరరా ఉత్సవాలకు అన్ని సదుపాయాలు సమకూర్చుతాం

**కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్**




**కూకట్‌పల్లి,– ప్రజా స్వేచ్ఛ**
ప్రతి ఏటా 124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా నిర్వహించే బతుకమ్మ,దసరా ఉత్సవాలు ఈసారి కూడా అంబిర్ చెరువు కట్ట మీద ఘనంగా నిర్వహించే విషయమై ఉత్సవాలు నిర్వహించే ప్రాంగణా స్థలంలో పర్యటించి,బతుకమ్మ,దసరా ఉత్సవాలకు అవసరమగు ఏర్పాట్లు గురించి ముందస్తు ప్రణాళికలతో చర్చించడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా జరుపుకునే బతుకమ్మ దసరా ఉత్సవాలకు వారి సౌకర్యార్థం అవసరమగు అన్ని ఏర్పాట్లును అందిస్తామని అన్నారు.ఉత్సవాలు జరిగే ప్రాంగణాన్ని మరియు పరిసర ప్రాంతాలను పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించి బతుకమ్మ ఆడే మహిళల కోసం సిద్ధం చేస్తున్నామని తెలియచేసారు. మనంమందరం కలిసి ప్రతి సంవత్సరంలాగానే ఈసారికూడా బతుకమ్మ దసరా పండుగ ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహించుకునేందుకు ప్రతిఒక్కరు సహకారించాలని కోరారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, కె.నరసింహులు,సిద్దయ్య, గోపాల్, లింగం,సుధాకర్, సత్తయ్య,రాజిరెడ్డి,బ్రహ్మయ్య,ఏ ఇ,శ్రావణి,వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ పాల్గొన్నారు.

# కనక దుర్గా కాళీ మాతా ఆలయం లో సందీప్ మహరాజ్,అనుచరుల కార్యక్రమాల పై కోర్టు స్టే



**– ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి**
మియాపూర్ శ్రీకనకదుర్గ కాళిమాత ఆలయంలో సందీప్ మహారాజ్ అతని అనుచరులు వినయ్,గుండె దయానంద్, కే సంతోష్,కే అర్చన లు పూజలు చేయరాదంటు కోర్టు ఆదేశాలు జారీ చేశారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని బస్ బాడీ వద్ద గల కనకదుర్గ కాళిమాత ఆలయాలో సందీప్ మహారాజ్ అనే వ్యక్తి అయన అనుచరులు అమావాస్య రోజు శాస్త్రానికి విరుద్ధంగా పూజలు నిర్వహించడం,హుండీలో ని 1,30,800,(లక్ష ముప్పై వేల ఎనిమిది వందల రూపాయలు)వాడుకోవడం పై ఈనెల 3వ తేదీ రోజు కనకదుర్గ కాళిమాత ఆలయ అధ్యక్షులు రాచమళ్ళ కృష్ణ పటేల్ గౌడ్ ఓ ఎస్. నం.1537 /2025 ద్వారా కోర్టును ఆశ్రయించడంతో, సందీప్ మహారాజ్,అతని అనుచరులు ఆలయంలో పూజలు చేయరాదని కోర్టు ఆదేశాలు జరిచేయగా,కోర్టు ఆదేశాల పై సందీప్ మహారాజ్ ఓ ఎస్ నం 1712 /2025 ద్వారా కోర్టును ఆశ్రయించగా సందీప్ మహారాజ్ వేసిన కేసు కొట్టివేస్తూ సందీప్ వినయ్, జి. దయానంద్,కె.సంతోష్,కె. అర్చన ల పై కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ కొనసాగుతుంది అని, కనకదుర్గ కాళిమాత ఆలయంలో ఎలాంటి పూజలు చేయరాదని తేది19సెప్టెంబర్ 2025 రోజు ఆదేశాలు జారిచేయడం జరిగిందని అధ్యక్షులు ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా తెలియజేసారు.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



**మెట్ పల్లి – ప్రజా స్వేచ్ఛ**
మెట్ పల్లి పద్మశాలి సంఘం వారి ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధులు తెలంగాణ పోరాట వీరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి పురస్కరించుకొని పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి పద్మశాలి పట్టణ అధ్యక్షులు ధ్యావనపెల్లి రాజారాం అధ్యక్షతన పూలమాలలు వేసి ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పట్టణంలోని 24 వార్డులకు చెందిన పద్మశాలి కుల సంఘాల అధ్యక్ష కార్యవర్గం మరియు పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

# జమాతే ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షుడిని కలిసిన గులాం అహ్మద్



**కరీంనగర్– ప్రజా స్వేచ్ఛ**
కరీంనగర్ పర్యటనకు వచ్చిన జమాతే ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షుడు సాధతుల్లా హుసేనిని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఆదివారం ఓ కాన్ఫరెన్స్ హాల్లో విఐపి మీట్ సందర్భంగా కరీంనగర్ జిల్లాకు సంబంధించి,సమకాలిన రాజకీయ,ఆర్థిక,ధార్మిక అంశాలపై కూలంకషంగా చర్చ జరిగింది.ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ జమాతే ఇస్లామీ హింద్ నిర్వహించే ఆధ్యాత్మిక, ధార్మిక కార్యకలాపాలలో ఎంఐఎం పార్టీ జమాతే ఇస్లామీ హింద్ కు మద్దతుగా ఎప్పుడూ నిలబడుతుందన్నారు. రాబోయే రోజుల్లో జమాతే ఇస్లామీ హింద్,ఎంఐఎం పార్టీకి కరీంనగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల్లో మద్దతుగా ఉండాలని కోరారు. ఇటీవలే ఎంఐఎం పార్టీ కరీంనగర్ కార్యాలయంలో జమాతే ఇస్లామీ హింద్ నిర్వహించిన జల్సా సిరతున్నబి నబి ఆధ్యాత్మిక సదస్సు విజయవంతమైనందుకు గులాం అహ్మద్ హుస్సేన్ ను జమాతే ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షుడితో పాటు రాష్ట్ర,జిల్లా నాయకులు అభినందించారు.

# హెవెన్లీ గేట్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**–గట్టు దయాకర్ పాఠశాల ప్రిన్సిపాల్**




**– ప్రజా స్వేచ్ఛ పెద్దమందడి/వనపర్తి జిల్లా ప్రతినిధి.**
వనపర్తి జిల్లాపెద్దమందడి మండలం,మోజెర్ల గ్రామం లో,హెవెన్లీ గేట్ స్కూల్‌లో శనివారం బతుకమ్మ పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందంగా జరుపుకున్నారు.తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ వేడుకలో బాలికలు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను తయారుచేసి ప్రదర్శించారు.ప్రతి తరగతి నుండి విద్యార్థిని విద్యార్థులు బతుకమ్మలు తయారు చేసి గౌరమ్మను పూజించి,సరస్వతి మాత విగ్రహాన్ని నూతన సంవత్సరలతో అలంకరించి పూలమలంకారం చేసి బతుకమ్మ సంబరాలు మొదలు పెట్టడం జరిగింది.విద్యార్థులు,ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో సొబగులు అద్దగా,బతుకమ్మ చుట్టూ నృత్యం చేస్తూ పాటలు పాడి వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ గట్టు దయాకర్ మాట్లాడుతూ, బతుకమ్మ,గురించి మరియు దసరా పండుగను,ఏ విధంగా జరుపుకుంటాము వివరంగా తెలియజేయడం జరిగింది. విద్యార్థిని,విద్యార్థులకు,పాఠశాల ఉపాధ్యాయ బృందానికి ముందస్తు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి ఎప్పుడూ గెలుస్తుందని దసరా మనకు బోధిస్తుందని అన్నారు.ఇది మనకు సత్యం,ధర్మం యొక్క ప్రాముఖ్యతను చూపుతోందని అన్నారు.దసరా సెలవుల్లో సమయం వృధా చేసుకోకుండా,ఇంటిదగ్గర శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థిని,విద్యార్థులకు గట్టు దయాకర్ సూచించారు.ఈ కార్యాక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీదేవి,ఎస్.నందిని, వరలక్ష్మి,స్వర్ణలత,ఎం. నందిని,యాదయ్య, అరుణ్,పాఠశాల సిబ్బంది జి.వరలక్ష్మి, దేవానందం,విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామ ప్రజలు పాలుగొనడం జరిగింది.

# ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు

-మండల వ్యాప్తంగా ప్రారంభమైన సంబురాలు
-ఉత్సాహంగా ఆడిపాడిన మహిళలు, యువతులు



**వలిగొండ - ప్రజా స్వేచ్ఛ**
ఒక్కేసి పువ్వేసి చందమామ.ఒక్కజాములాయే చందమామ.అంటూ మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు మండల వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు.ఈ సందర్భంగా ఆడపడుచులు ఉపవాసం ఉండి రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సాయంత్రం వాడవాడలా ఆలయాల వద్ద బతుకమ్మలను పెట్టి ఆడగా, పాటలు పాడుతూ గౌరమ్మను కొలుస్తూ బతుకమ్మల చుట్టూ తిరిగారు ఆలయాలు, వీధులన్నీ మార్మోగాయి.పెద్దఎత్తున మహిళలు యువతులు తరలివచ్చి బతుకమ్మ ఆటపాటలతో హోరెత్తించారు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్న అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు

# ఘనంగా గంగుల చంద్ర శేఖర్ యాదవ్ మాతృమూర్తి లక్ష్మమ్మ ప్రథమ వర్ధంతి



**శేరిలింగంపల్లి ప్రతినిధి - ప్రజా స్వేచ్ఛ**
కొండాపూర్ డివిజన్ పరిధిలోనీ రాఘవేంద్ర కాలనీలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు గంగుల చంద్ర శేఖర్ యాదవ్ మాతృమూర్తి లక్ష్మమ్మ ప్రథమ వర్ధంతి ఆదివారం రోజున రాఘవేంద్ర కాలనీలో నీ వారి స్వగృహంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలోవివిధ పార్టీల కీ చెందిన నాయకులు, పురప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన తల్లి పేరున జి హెచ్ ఎం సి పారిశుధ్య కార్మికులకి నూతన వస్త్రాలు అందించిన గంగుల చంద్ర శేఖర్ యాదవ్ వారు చేస్తున్న విశిష్టమైన సేవలను గుర్తించి ఈ సత్కారం ను చేస్తున్నాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జంగయ్య యాదవ్,ప్రభాకర్ యాదవ్, గోపాల్ యాదవ్,మల్లేశ్ యాదవ్,అనీష్ యాదవ్ లతో పాటు గంగుల చంద్ర శేఖర్ యాదవ్ కుటుంబ సభ్యులు వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# మోటకొండూరు మండలంలో బతుకమ్మ పండుగ

- ప్రత్యేక వస్త్రఅలంకారణ తో అలరించిన ఆడపడుచులు
- వర్షంలో కూడా బతుకమ్మ ఆట

**- ప్రజా స్వేచ్ఛ ,మోటకొండూర్ ప్రతినిధి:**



మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఆడపడుచులు బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవడం జరిగింది.బతుకమ్మ ఆటకు వర్షం ఆటంకం కలిగించిన మహిళలు వర్షంలో తడుస్తూ కూడా బతుకమ్మ పండుగ జరుపుకోవడం విశేషం. మండలంలోని అన్ని గ్రామాలలో దాదాపు వర్షం ఆరు గంటలనుండి మొదలై రాత్రి వరకు కూడా వర్షం కురవడంతో మహిళలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగింది.

# ఎఫ్ సి ఐ కాలనీ లో నూతన పార్క్ ప్రారంభోత్సవం

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

**ప్రజా స్వేచ్ఛ ఎల్ బి నగర్ నియోజకవర్గ**



వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్.సీ.ఐ.కాలనీ నందు నూతనంగా నిర్మించిన పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా.రాజశేఖర్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్ గౌడ్,దూసరి మధు గౌడ్,పీ.వీ.రావు కాలనీ అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు వైద్యంపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా - ప్రజా స్వేచ్ఛ**
ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.ఆదివారం ఆయన రామాయంపేట మండల పరిధిలోని డి.ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రక్త పరీక్షల గది, ఎక్స్‌రే రూమ్,ల్యాబ్ గదులను సమీక్షించారు.చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎవరెవరు ఏ రుగ్మతలతో వచ్చారు,ఎలా చికిత్స అందిస్తున్నారు అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో ఇప్పటివరకు జరిగిన ప్రసవాలు,వాటిలో సాధారణ ప్రసవాలు,సిజేరియన్‌లు ఎన్ని జరిగాయి,మలేరియా, టైఫాయిడ్,డెంగ్యూ, చికన్‌గున్యా వంటి వ్యాధుల నమోదుపై పూర్తి సమాచారం పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతి సౌకర్యాలు,వైద్యుల అందుబాటుమెరుగైన వైద్య సేవలు ఉండటం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యులు చిత్తశుద్ధితో సేవలందించాలి.ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని ముఖ్యంగా పరిగణించి పనిచేస్తోంది. ఆసుపత్రుల్లో ఏవైనా సమస్యలు ఉంటే తక్షణమే సమాచారం ఇవ్వాలి అన్నారు.

# ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శించినఆగారం ప్రకాష్



**ప్రజా స్వేచ్ఛ వనపర్తి జిల్లా ప్రతినిధి.**
ఘనపూర్ మండల కేంద్రం లోబెస్త బాయికడి సత్యం కుమారుడు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లోసంజీవని ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నాడు.ఇట్టి విషయం తెలుసుకున్న ఆగారం ప్రకాష్ ఆసుపత్రికి స్వయంగా వెళ్లి పరామర్శించడం జరిగింది. అనంతరం వారి కుటుంబ సభ్యులనుపరామర్శించి,ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకొని,మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లతో మాట్లాడడం జరిగింది.తల్లిదండ్రులు ఎలాంటి అధైర్య పడొద్దు అని,ఏదైనా సహాయం కావాలంటే అన్ని విధాలుగాఅండగా ఉంటానని,ధైర్యంగా ఉండాలని వారికి చెప్పడం జరిగింది.ఆగారం ప్రకాష్ తో పాటు పరామర్శించిన,టౌన్ అధ్యక్షులు గాండ్ల నరేందర్,బాయికాడి వినోద్,కడమోని నరేష్, భూరాన్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ గుడి నూతన నిర్మాణ పత్రం నుగుడి దగ్గర గ్రామ పెద్దలకు అందజేయుట



**ప్రజా స్వేచ్ఛ /వనపర్తి జిల్లా ప్రతినిధి**
పెద్దమందడి మండల కేంద్రం లోఆదివారం రోజు గ్రామ పోచమ్మ గుడి నూతన నిర్మాణ మంజూరు పత్రమును,పెద్దమందడి గ్రామ పెద్దలకు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొమ్ము వెంకటస్వామి,సింగల్ విండో డైరెక్టర్ నరేష్ కుమార్, మాజీ ఎస్ఎంసి చైర్మన్ టైలర్ రవి,టిఎంఆర్ నాయకులు సూర్యవంశం రాఘవేందర్,వాకిటి నాగభూషణం,పల్లె రాములు,అశ్విని భగవంతు,చాకలి లక్ష్మీనారాయణ,జంగం శంకర్,కురుమయ్య, మహేష్,బోయ స్వామి,గొల్ల గోపి,ఆర్టీసీ ప్రకాష్,స్టార్ శీను,చిన్న మన్యం తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి ప్రతిబింబం

-కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా ప్రతినిధి - ప్రజా స్వేచ్ఛ**
పూలను పూజించి ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ, తెలంగాణ విశిష్ట సంస్కృతి సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు.జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూకుటుంబ సమేతంగా ఈ పండుగను ఉల్లాసంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.స్త్రీ శక్తికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ,తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి చిహ్నమని అన్నారు.బతుకమ్మలు నిమజ్జనం సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని,అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో అందరూ ఐకమత్యం, సోదరభావంతో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు.

# ఆత్మీయంగా విజయదశమి ఉత్సవం



**ప్రజా స్వేచ్ఛ- శేరిలింగంపల్లి ప్రతినిధి**
సమాజనిర్మాణంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం కీలక పాత్ర పోషిస్తోంది అని సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఇందులో పాలుపంచుకుంటున్న స్వయం సేవకులకు అభినందనలు తెలిపారు. మియాపూర్, మాతృశ్రీనగర్ లో ఏర్పాటు చేసిన విజయదశమి ఉత్సవంలో సత్యనారాయణ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆదివారం ఉదయం ఆత్మీయ వాతావరణం లో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్వయం సేవకులు పాల్గొన్నారు. సంఘ కార్య శతాబ్ది ఉత్సవంలో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు. పూర్తి గణవేష్ (యూనిఫామ్) తో వచ్చిన స్వయం సేవకులతో ప్రాంగణం కళకళలాడింది. మాతృశ్రీనగర్ వాసులు, మాతృమూర్తులు, కుటుంబ సభ్యులతో సహా తరలివచ్చారు. విజయదశమి స్ఫూర్తిని మాతృశ్రీనగర్ వాసులు కుటుంబంతో సహా పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఆర్ఎస్ఎస్ కూకట్ పల్లి భాగ్, సంపర్క్ ప్రముఖ్ పెద్ది బీరప్ప విచ్చేశారు. 1925లో మొదలైన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 100 సంవత్సరాలుగా సమాజ నిర్మాణంలో పాలు పంచుకుంటున్నది అని సోదాహరణంగా వివరించారు. పంచపరివర్తన ద్వారా సమాజంలో గొప్ప మార్పులు తీసుకుని రావచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నగర సహ కార్యవాహ భాస్కరరావు గంట, బస్తీ ప్రముఖ్ అల్లంపాటి శివశంకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిఖిల్ భరత్ స్కూల్ లో ముందస్తు బతుకమ్మ వేడుకలు

**మెట్ పల్లి - ప్రజా స్వేచ్ఛ**




నిఖిల్ భరత్ స్కూల్ లో ముందస్తు బతుకమ్మ వేడుకలు మెట్ పల్లి పట్టణంలోని నిఖిల్ భరత్ స్కూల్ లో ఆదివారం ఘనంగా బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగినవి. ఈ కార్యక్రమంలో బతుకమ్మ లను రంగు రంగుల పూలతో తయారు చేసి బతుకమ్మ ఆట- పాటలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో నిఖిల్ భరత్ స్కూల్ ప్రిన్సిపాల్ మహర్షి, మరియు ఉపాధ్యాయులు విద్యార్థిని విధ్యార్థులు పాల్గొన్నారు.

# డాక్టర్.జిల్లెల.చిన్నారెడ్డి ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

-సి.పెంటన్న యాదవ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దమందడి

**ప్రజా స్వేచ్ఛ**
**21.పెద్దమందడి/వనపర్తి జిల్లా ప్రతినిధి.**



డాక్టర్.జిల్లెల్ల.చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు ఆదేశాల మేరకు,పెద్దమందడి మండలం, జగత్ పల్లె గ్రామానికి చెందిన, చిట్టెమ్మ అనారోగ్యం కారణంగా ఆసుపత్రి కి అయిన ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా,ఆమెకు రూ,32,000/-చెక్కును అందజేసిన పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సి.పెంటన్న యాదవ్.ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కాంగ్రెస్ పార్టీ ఎంతో మంది పేద ప్రజలకు అండగా నిలుస్తుంది అని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో ఉషనయ్య, పెంటన్న,రాములు,వెంకట్ రాములు,చెన్నయ్య, ఆశన్న,బోయ వెంకటయ్య, గిరన్న, కురుమన్న పాల్గొన్నారు.

# బిజినెస్

# మిలియనీర్స్ పాటించే మనీ ఫార్ములా ఇదే..

ప్రపంచంలో ఉన్న మిలియనీర్స్ లో చాలామంది పుట్టుకతో కోటీశ్వరులు కారు. జీరోతో మొదలై చిన్న ఉద్యోగంతోనో, బిజినెస్‌తోనో మెల్లగా ఎదిగిన వాళ్లే. వాళ్లంతా మిలియనీర్స్ అవ్వడానికి వాళ్లు పాటించిన సేవింగ్ ఫార్ములాలే కారణం. అసలు సేవింగ్స్ అంటే ఎలా ఉండాలి? మిలియనీర్స్ పాటించే డబ్బు సూత్రాలేంటి? ఇప్పుడు తెలుసుకుందాం.

ఇంట్రెస్టింగ్ విషయమేంటంటే.. ప్రపంచంలో ఉన్న మిలియనీర్స్ అందరికీ ఒకేరకమైన సేవింగ్ ప్లాన్స్ ఉన్నట్టు స్టడీల్లో తేలింది. సొంతగా ఎదిగిన మిలియనీర్స్ అందరూ వయసు యాభై దాటిన తర్వాతే మిలియనీర్స్ అయ్యారట. ఈ యాభై ఏళ్లు ఎంతో ప్లానింగ్‌తో సేవింగ్స్ చేశారు. అదెలాగంటే..

## గోల్డెన్ రూల్

మిలియనీర్స్ అందరూ పాటించిన ఒక గోల్డెన్ రూల్ ఏంటంటే.. వారి ఆదాయంలో 20 నుంచి 30 శాతం సేవ్ చేయడం. కానీ, ఈ రోజుల్లో సగటు ఉద్యోగి తన ఆదాయంలో కేవలం 8 శాతమే ఆదా చేస్తున్నాడు. ఇదే మిలియనీర్స్ కు మనకు ఉన్న తేడా. సరైన సేవింగ్ ప్లాన్ ఉంటే చాలు మెల్లగా కోటీశ్వరులుగా మారొచ్చు. ఆ సేవింగ్ ప్లాన్ కూడా ఒక స్ట్రక్చర్ లో ఉండాలి.



గుడ్డిగా దాచుకోకుండా.. రిటైర్‌మెంట్ కోసం కొంత, ఎమర్జెన్సీ కోసం కొంత ఇలా.. మీ అవసరాలను బట్టి సేవింగ్స్ ఉండాలి.

## టైం ఈజ్ మనీ

మిలియనీర్స్ ఫాలో అయ్యే మరో సూత్రం టైం ఈజ్ మనీ. అంటే డబ్బు ఆదా చేసే విషయంలో లేట్ చేయకూడదు. వెంటనే మొదలు పెట్టాలి. దాన్ని ఒక క్రమం తప్పని అలవాటుగా మార్చుకోవాలి. తక్కువ వయసులో ఉన్నప్పుడే మిలియనీర్ అవ్వాలంటే తక్కువ వయసు నుంచే సేవింగ్ చేయడం మొదలుపెట్టాలి.

## ఇన్వెస్ట్‌మెంట్స్

మిలియనీర్స్ అవ్వాలంటే సేవింగ్స్ తో పాటు ఇన్వెస్ట్ మెంట్స్ కూడా చేయాలి. కొద్దిమొత్తంలో అయినా మ్యూచువల్ ఫండ్స్, రికరింగ్ డిపాజిట్స్ వంటి వాటిలో డబ్బు ఇన్వెస్ట్ చేస్తూ ఉంటే కొన్నేళ్లకు మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. వీటి విషయంలో తొందర పడకూడదు. సుమారు పదేళ్ల పాటు ఇలాంటి ఇన్వెస్ట్ మెంట్స్ చేస్తూ పోవాలి. అప్పుడే పెద్దమొత్తంలో ఆదాయం వస్తుంది.

## టెంప్ట్ అవ్వరు

మిలియనీర్స్ గా ఎదగాలంటే టెంప్టింగ్ అలవాటుని మానుకోవాలి. స్లో అండ్ స్టడీ విధానాన్ని ఫాలో అవ్వాలి. సొంతంగా ఎదిగిన మిలియనీర్స్ ఎవరూ టెంప్ట్ అయ్యే మైండ్ ఉన్నవాళ్లు కాదు. అంటే అవసరం లేకపోయినా పెద్ద పెద్ద కార్లు కొనడం, అవసరం లేని విలాసాలకు పోవడం వంటివి చేయరు. ఉన్నంతలో సింపుల్ గా ఉండడానికి ప్రయత్నిస్తారు.

## అప్పులు చేయరు

అప్పులు చేసేవాళ్లు ఎప్పటికీ ఆస్తిపరులు కాలేరు. అందుకే మిలియనీర్స్ అవ్వాలంటే అప్పులు చేసే అలవాటుని మానుకోవాలి. అప్పులు చేయడం, బెట్టింగ్స్ వంటి మార్గాల ద్వారా సంపాదించాలని చూడడం.. ఇలాంటి అలవాట్ల వల్ల ఎప్పటికీ మిలియనీర్లు అవ్వలేరు. ఒకవేళ అయినా డబ్బు ఎక్కువ కాలం నిలవదు.

# రూ.5 లక్షల పెట్టుబడికి రూ.10 లక్షల రాబడి

## పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్ ట్రై చేద్దామా!




తపాలా శాఖ అందిస్తున్న రకరకాల స్కీముల్లో పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్ (టీడీ) స్కీం ఆకర్షణీయం. ఇదికూడా ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ)లాగే ఉంటుంది. నిర్దిష్ట మొత్తాలు డిపాజిట్ చేస్తే.. దానిపై వడ్డీ వస్తుంది. సురక్షిత పెట్టుబడి సాధనాలను కోరుకునేవారికి అనువైనది. కాగా, 1, 2, 3 లేదా ఐదేండ్ల కాలపరిమితుల్లో పెట్టుబడి పెట్టుకోవచ్చు. కానీ ఇందులో 5 ఏండ్ల ప్లాన్‌కు డిమాండ్ ఉన్నది. అధిక రాబడులేగాక, ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఐటీ మినహాయింపులనూ పొందవచ్చు.ఇక వడ్డీ 3 నెలలకోసారి లెక్కించి, వార్షిక ప్రాతిపదికన చెల్లిస్తారు. ప్రస్తుతం ఏడాది డిపాజిట్‌పై వార్షిక వడ్డీరేటు 6.9 శాతంగా ఉన్నది. అలాగే 2 ఏండ్లపై 7 శాతం, 3 ఏండ్లపై 7.1 శాతం, 5 ఏండ్ల టీడీపై గరిష్ఠంగా 7.5 శాతం వడ్డీరేటున్నది. 5 ఏండ్ల టీడీలో రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టినైట్టైతే ఆఖర్లో దాదాపు రూ.7.21 లక్షలు అందుకోవచ్చు. అయితే మరో ఐదేండ్లు ఈ మొత్తాన్ని అలాగే ఉంచితే చివరకు రూ.10.40 లక్షలు తీసుకోవచ్చు.

# హైదరాబాద్, విజయవాడలో బంగారం తులం ధర ఎంతుందంటే..

పసిడి ధరలు నాన్ స్టాప్‌గా పెరుగుతూనే ఉన్నాయి.. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో లక్షా 13 వేల మార్క్ దాటి.. ఆల్ టైం హైకి చేరుకున్నాయి. అయితే.. వెండి ధరలు కూడా పసడి బాటలోనే కొనసాగుతున్నాయి. వాస్తవానికి బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరల్లో ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చోటుచేసుకుంటాయి.. అయితే.. కొన్నిసార్లు ధరలు పెరిగితే.. మరికొన్ని కొన్నిసార్లు తగ్గుతూ వస్తుంటాయి.. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులతో ఇటీవల కాలంలో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి.. తాజాగా.. పసిడి, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి.. సెప్టెంబర్ 21 2025



ఆదివారం ఉదయం ఆరుగంటల వరకు నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోండి..

24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,12,150 గా ఉంది.

22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,02,800 కి చేరుకుంది.

వెండి కిలో ధర రూ.100 పెరిగి.. రూ.1,35,000లుగా ఉంది.

అయితే, ప్రాంతాల వారిగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది.

ప్రధాన నగరాల్లో బంగారం ధరలు..

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,12,150 ఉండగా.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,02,800 ఉంది. కిలో వెండి ధర రూ.1,45,000 గా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,12,150 ఉండగా.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,02,800 ఉంది. కిలో వెండి ధర రూ.1,45,000 గా ఉంది.

# భారత్ చేతిలో మళ్లీ చిత్తయిన పాక్

## అభిషేక్, గిల్ వీరబాదుడు
## బంతితో మెరిసిన దూబె
## ఫర్హాన్ అర్ధ శతకం వృథా

**దుబాయ్**

ఆసియా కప్‌లో ఓటమన్నదే లేకుండా సాగుతున్న భారత్ మరో అద్భుత విజయాన్ని నమోదుచేసింది. దాయాది పాకిస్థాన్‌తో ఆదివారం దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాక్ నిర్దేశించిన 172 పరుగుల లక్ష్యాన్ని టీమ్‌ఇండియా.. 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి బాదేసింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (39 బంతుల్లో 74, 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (28 బంతుల్లో 47, 8 ఫోర్లు) దూకుడుతో భారత్ చేతిలో పాక్‌కు వరుసగా రెండో ఓటమి తప్పలేదు.

తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్.. 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 171 రన్స్ చేసింది. సాహిబ్‌జాదా ఫర్హాన్ (45 బంతుల్లో 58, 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ శతకంతో ఆ జట్టును ఆదుకున్నాడు. శివమ్ దూబె (2/33), కుల్‌దీప్ యాదవ్ (1/31) పాక్‌ను కట్టడిచేశారు. ఈ టోర్నీలో భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను బుధవారం బంగ్లాదేశ్‌తో ఆడనుంది.

**ఓపెనర్ల వీరవిహారం**

20 ఓవర్లలో 172 పరుగుల లక్ష్యం టీ20లలో మరీ సులువైనదేం కాదు. కానీ అభిషేక్, గిల్ ఒకరిని మించి ఒకరు పాక్ బౌలర్లను వంతులు వేసుకుని మరీ బాదడంతో లక్ష్యం తేలికైపోయింది. షాహీన్ తొలి ఓవర్లో మొదటి బంతికే లెగ్ స్టంప్ మీదుగా సిక్స్ కొట్టిన అభిషేక్ తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. గిల్ కూడా అయూబ్ రెండో ఓవర్లో షార్ట్ ఫైన్,




ఎక్స్‌ట్రా కవర్స్ మీదుగా రెండు బౌండరీలు రాబట్టాడు. ఆ తర్వాత అఫ్రిది ఓవర్లోనూ రెండు ఫోర్లు కొట్టాడు. అబ్రార్ 3వ ఓవర్లో అభిషేక్ 4,6 బాదగా అయూబ్ 6వ ఓవర్లో గిల్ మరో రెండు ఫోర్లు సాధించాడు. 7వ ఓవర్లో అబ్రార్‌ను రెండు భారీ సిక్సర్లతో అరుసుకున్న అభిషేక్.. అయూబ్ బౌలింగ్‌లో బౌండరీతో 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీని పూర్తిచేశాడు.

ఈ ఇద్దరి దూకుడుతో 8.4 ఓవర్లలోనే భారత్ వంద పరుగుల మైలురాయిని దాటింది. విజయం దిశగా సాఫీగా సాగుతున్న క్రమంలో ఫహీమ్ 9వ ఓవర్లో గిల్‌ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో 105 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. హారీస్ రౌఫ్ వేసిన ఆ తర్వాతి ఓవర్లో కెప్టెన్ సూర్య డకౌట్ అయ్యాడు. అబ్రార్ 13వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయిన అభిషేక్.. లాంగాన్ వద్ద రౌఫ్‌కు క్యాచ్ ఇచ్చాడు. 17వ ఓవర్లో శాంసన్ (17)ను రౌఫ్ బౌల్డ్ చేయడంతో మ్యాచ్‌లో కాస్త ఉత్కంఠ రేగింది. కానీ తిలక్ వర్మ (19 బంతుల్లో 30నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), హార్దిక్ పాండ్యా (7నాటౌట్) గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశారు.

**దూకుడుగా ప్రారంభించి..**

మొదట బ్యాటింగ్ చేసిన పాక్ ఇన్నింగ్స్‌ను దూకుడుగానే మొదలెట్టింది. బుమ్రా రెండో ఓవర్‌లో ఫకార్ జమాన్ (15) రెండు బౌండరీలు కొట్టాడు. హార్ధిక్ మూడో ఓవర్లోనూ ఫోర్ కొట్టిన అతడు.. మూడో బంతికి కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఇన్నింగ్స్ మూడో బంతికే హార్ధిక్ బౌలింగ్‌లో థర్డ్‌మ్యాన్ వద్ద అభిషేక్ క్యాచ్ నేలపాలు చేయడంతో బతికిపోయిన ఫర్హాన్ బాదే బాధ్యతను తీసుకున్నాడు. బుమ్రా వేసిన 4, 5వ ఓవర్లలో రెండేసి ఫోర్లు బాదిన అతడు.. వరుణ్ 8వ ఓవర్లో సిక్స్ కొట్టాడు. గత మూడు మ్యాచ్‌లలో సున్నాలు చుట్టిన అయూబ్ (21) ఈ మ్యాచ్‌లో మరీ ధాటిగా ఆడకపోయినా ఫర్హాన్‌కు అండగా నిలిచాడు. రెండో వికెట్‌కు ఫర్హాన్‌తో 72 రన్స్ జోడించాడు. అక్షర్ పదో ఓవర్లో మిడ్ వికెట్ మీదుగా సిక్స్ కొట్టిన ఫర్హాన్ 34 బంతుల్లో అర్ధ శతకాన్ని సాధించాడు.

**నిలువరించిన దూబె**

10 ఓవర్లలో పాక్ స్కోరు 91/1. వాళ్ల జోరు చూస్తే భారీ స్కోరు ఖాయమే అనిపించింది. కానీ దూబె రాకతో పాక్ బ్యాటింగ్ జోరుకు బ్రేక్‌పడింది. చివరి 60 బంతుల్లో ఆ జట్టు 4 వికెట్లు కోల్పోయి 80 పరుగులే చేయగలిగింది. 11వ ఓవర్‌లో దూబె.. అయూబ్‌ను ఔట్ చేసి భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. 14వ ఓవర్‌లో కుల్‌దీప్.. తొలి బంతికే హుస్సేన్ తలాత్ (10)ను ఔట్ చేశాడు. మరుసటి ఓవర్లో దూబె.. ఫర్హాన్‌నూ బోల్తా కొట్టించాడు. కెప్టెన్ సల్మాన్ అఘా (17నాటౌట్), నవాజ్ (21) వేగంగా ఆడలేకపోయారు. ఆఖర్లో ఫహీమ్ అష్రఫ్ (20నాటౌట్) మెరుపులు మెరిపించాడు.

# భారత్-పాక్ వివాదంలో పైక్రాఫ్ట్‌కు అశ్విన్ మద్దతు..

## టీచరో.. ప్రిన్సిపాల్ కాదన్న మాజీ స్పిన్నర్..!

ఆసియా కప్‌లో భాగంగా ఇటీవల భారత్-పాక్ మధ్య జరిగిన మ్యాచ్‌లో వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. కరచాలనం వివాదంపై భారత మాజీ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌కు మద్దతు ప్రకటించారు. జింబాబ్వే అధికారి స్కూల్ టీచర్ కాదని, ఆయన తన పాత్రను బాగా నిర్వహిస్తున్నాడని అశ్విన్ పేర్కొన్నారు. గత ఆదివారం



ఆసియా కప్ మ్యాచ్ తర్వాత భారత ఆటగాళ్లు విధానపరమైన నిర్ణయం ప్రకారం.. పాకిస్తాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయనప్పుడు పైక్రాఫ్ట్ మ్యాచ్ రిఫరీగా వ్యవహరించిన విషయం తెలిసిందే. టాస్ సమయంలో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘాతో కరచాలనం చేయకపోవడంపై వివాదం చెలరేగగా.. ఇందులోకి పీసీబీ పైక్రాఫ్ట్‌ను లాగింది.

# స్పోర్ట్స్

# రన్నరప్‌తో సరి..

## ఫైనల్‌లో మళ్లీ తడబడ్డ సాత్విక్ జోడీ



**షెన్‌జెన్ (చైనా):**

ఈ సీజన్‌లో తొలి టైటిల్ వేటలో ఉన్న భారత అగ్రశ్రేణి జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టికి మరోసారి నిరాశే ఎదురైంది. వరుసగా రెండో టోర్నీలో ఫైనల్ చేరిన ఈ ద్వయం.. చైనా మాస్టర్స్ సూపర్-750 టోర్నీలోనూ రన్నరప్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్‌లో ఎనిమిదో సీడ్ భారత జోడీ.. 19-21, 15-21తో టాప్ సీడ్ కిమ్ వోన్ హో-సియో సియాంగ్ జే (కొరియా) చేతిలో పరాభవం పాలైంది.45 నిమిషాల్లో ముగిసిన పోరులో ప్రపంచ నెంబర్ వన్ కొరియా జంట వరుస గేమ్స్‌లో భారత ద్వయాన్ని ఓడించి టైటిల్ ఎగురేసుకుపోయింది. ఈ సీజన్‌లో ఇప్పటికే 9వ ఫైనల్ ఆడుతూ ఆరు టైటిల్స్ సాధించిన కొరియన్ జోడీ.. తాజాగా మరో టైటిల్‌ను తమ ఖాతాలో వేసుకుంది. తొలి గేమ్ ఆరంభంలో ఆధిపత్యం చేతులు మారినా 17-17తో స్కోర్లు సమం కాగా చిరాగ్ చేసిన తప్పిదం కొరియాకు ఆధిక్యాన్ని అందించి గేమ్‌ను దక్కించుకునేలా చేసింది. రెండో గేమ్‌లోనూ 9-9తో రెండు జంటలూ సమంగా నిలిచినా భారత ద్వయం చేసిన తప్పిదాలను తమకు అనుకూలంగా మలుచుకున్న కిమ్-సియో జోడీ టైటిల్‌ను దక్కించుకుంది.




# ఓజీ' ట్రైలర్ విడుదల వాయిదా..

## ఎప్పుడంటే.!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానుల ఎదురుచూపులకు తెరదించుతూ 'ఓజీ' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. సినిమా రిలీజ్‌కు ఇంకా ఐదు రోజులు మాత్రమే ఉండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే ఈరోజు ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ ట్రైలర్‌ను కొన్ని గంటలు వాయిదా వేసినట్లు తెలిపింది. ఈ మూవీ ట్రైలర్‌ను నేడు సాయంత్రం జరిగే 'ఓజీ' కాన్సర్ట్‌లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. సెప్టెంబర్ 21న సాయంత్రం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో 'ఓజీ' కాన్సర్ట్‌ను నిర్వహించబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ కార్యక్రమం ప్రధానంగా పాటల విడుదల వేడుకగా భావిస్తున్నారు. ఈవెంట్‌కు పవన్ కల్యాణ్ హాజరవుతారా లేదా అనే దానిపై మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. అయితే చిత్ర యూనిట్‌లోని మిగతా సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. పవన్ రాకపై క్లారిటీ వస్తే ఈ కాన్సర్ట్ మరింత గ్రాండ్‌గా మారే అవకాశం ఉంది.



# 600 మంది డ్యాన్సర్లతో 'అఖండ' మాస్ సాంగ్

నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'అఖండ 2' (తాండవం). బ్లాక్ బస్టర్ సినిమా 'అఖండ' చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించిన చిత్ర యూనిట్ అనంతరం జార్జియాలో కూడా పలు కీలక సన్నివేశాలను చిత్రీకరించింది. అయితే తాజాగా రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక ఎపిసోడ్‌లను చిత్రీకరిస్తుంది చిత్రయూనిట్. అయితే ఫిల్మ్ సిటీలో జరుగుతున్న ఈ షెడ్యూల్‌లో బాలకృష్ణతో బోయపాటి ఒక మాస్ సాంగ్‌ను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దాదాపు 600 మంది డ్యాన్సర్ల ఈ సాంగ్‌లో బాలయ్యతో కలిసి డ్యాన్స్ చేయబోతున్నారు. భాను నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పకులు. సంయుక్త కథానాయికగా నటిస్తుండగా.. ఆది పినిశెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు.




## ఓటీటీలోకి ఫహాద్ ఫాజిల్ కొత్త మూవీ..

### స్ట్రీమింగ్ ఎక్కడంటే.!

మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో నటించిన రొమాంటిక్ కామెడీ మూవీ 'ఓడుం కుతిర చాదుం కుతిర' . ఈ సినిమాలో కొత్త లోకతో సూపర్ హిట్ అందుకున్న ల్యాణి ప్రియదర్శన్, రేవతి పిళ్లై కథానాయికలుగా నటించారు. ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి హిట్ అందుకుంది. అయితే తాజాగా ఈ సినిమాను ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ఫ్లిక్స్' లో ఈ నెల 26 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతుంది.



# సుకుమార్ దర్శకత్వంలో రెండోసారి?

సుకుమార్ కొత్త సినిమా అంటే టెక్నికల్ టీమ్‌ను ఎంచుకోవడం పెద్ద పనేం కాదు. వారెప్పుడూ ఆయనకు సిద్ధంగానే ఉంటారు. ఆర్టిస్టుల ఎంపికే సుకుమార్‌కి పెద్ద పని. 'పుష్ప 2' తర్వాత ఆయన రామ్‌చరణ్‌తో సినిమా చేయనున్నారు. కథను కూడా లాక్ చేసేశారు. ఈ కథలో హీరోయిన్ పాత్ర కీలకమని సమాచారం. ఆ పాత్ర కోసం కృతీ సనన్‌ను తీసుకోవాలనుకుంటున్నారట సుకుమార్. తన కథలో నాయిక పాత్రకు కృతి సనన్ సరిగ్గా సరిపోతుందని సుకుమార్ భావించారట.సాధారణంగా కథానాయికను ఆడిషన్, ఫొటో షూట్ చేసి తీసుకోవడం సుకుమార్ ఆనవాయితీ. కృతీ సనన్ అయితే అలాంటి అవసరం లేకుండానే, నిస్సంకోచంగా తీసుకోవచ్చని సుకుమార్ భావిస్తున్నారట. ఇప్పటికే సుకుమార్‌తో పనిచేసిన అనుభవం కృతి సనన్‌కి ఉంది. మహేశ్ 'వన్' సినిమాలో ఆమే కథానాయిక. ఈ సినిమా ఖరారైతే సుకుమార్ డైరెక్షన్‌లో రెండోసారి నటించినట్టవుతుంది.

## ధనుష్ 'ఇడ్లీ కొట్టు' ట్రైలర్ విడుదల




తమిళ అగ్ర హీరో ధనుష్ స్వీయ దర్శకత్వంలో నటించి, ఆకాష్ భాస్కరన్‌తో కలిసి నిర్మించిన తమిళ సినిమా 'ఇడ్లీ కడై'. ఈ సినిమా.. 'ఇడ్లీ కొట్టు' పేరుతో అక్టోబర్ 1న తెలుగులో విడుదల కానుంది. శ్రీ వేదక్షర మూవీస్ పతాకంపై నిర్మాత రామారావు చింతపల్లి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. దర్శకుడిగా ధనుష్ నాలుగో సినిమా ఇది. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'మిషన్లతో అన్నీ చేసేయొచ్చు అంటారు కానీ రుచి అనేది మాత్రం.. మనసు పెడితేనే వస్తుంది. జీవితంలో మనం చేసే పనిని ఆదాయం కోసం మాత్రమే కాదు. ఆస్వాదిస్తూ కూడా చేయాలంటూ వచ్చే డైలాగ్‌లు ఈ ట్రైలర్‌లో ఆకట్టుకుంటున్నాయి. ధనుష్ ఈ సినిమాలో చెఫ్ పాత్రలో కనిపించబోతున్నాడు. నిత్యామీనన్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో అరుణ్ విజయ్, షాలిని పాండే, సత్యరాజ్, రాజ్‌కిరణ్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: కిరణ్ కౌశిక్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, నిర్మాణం: డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ ప్రై.లిమిటెడ్

## హృతిక్‌తో నేషనల్ క్రష్..



హృతిక్ రోషన్ కథానాయకుడిగా తెరకెక్కిన 'క్రిష్' చిత్రానికి మరో సీక్వెల్ రాబోతుంది. ఇప్పటికే ఈ చిత్రం మూడు పార్టులుగా ప్రేక్షకుల ముందుకొచ్చి విజయం సాధించాయి. ఇప్పుడు క్రిష్-4 కూడా రానున్నట్లు రాకేశ్ రోషన్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికో విశేషం ఉంది. ఇందులో హృతిక్ రోషన్ హీరోగా నటించడమే కాకుండా స్వయంగా ఆయనే దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. దర్శకుడిగా హృతిక్‌కు తొలి చిత్రమిది. వచ్చే ఏడాది ఈ చిత్రం సెట్స్ మీదకెళ్లనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు కథానాయిక కోసం వేట మొదలుపెట్టారు మేకర్స్. అయితే ఈ చిత్రం కోసం నేషనల్ క్రష్ రష్మిక మందన్నాను సంప్రదించినట్లు, ఆమె అంగీకారం తెలిపినట్లు బాలీవుడ్ మీడియా చెబుతోంది. త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాది చిత్రీకరణను మొదలుపెడతామని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రాకేశ్ రోషన్ తెలిపారు. 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి రష్మిక ఈ చిత్రంలో ఉందో లేదో తెలియాలంటే కాస్త వేచి చూడాల్సిందే!

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492